గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# నవంబర్ 2016
# కథలు




" నీ నిర్ణయం మారదా రాజేష్ " పేలవంగా అడిగాడు చక్రవర్తి. "ఇది వెంటనే తీసుకున్న నిర్ణయం కాదు నాన్న. బాగా ఆలోచించిన తరువాత తీసుకున్న నిర్ణయం" అన్నాడు చక్రవర్తి కొడుకు రాజేష్.

"నాకు మాత్రం నువ్వు తప్ప ఇంకెవరు ఉన్నారు. నిన్ను కోడలికి విడిచి పెట్టి ఓల్డ్ ఏజ్ హోమ్ లో ఎలా ఉండ గలను. నాకు మాత్రం మీతో కలసి ఉండాలని ఉండదా. దయ చేసి ఇంకో సారి ఆలోచించు. నా వల్ల మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. మిమ్మల్ని ఏ విధం గాను ఇబ్బంది పెట్టను. నాకు పదిహేను వేలు పెన్షన్ వస్తుంది. ఆ డబ్బంతా మీకే ఇస్తాను. నన్ను మాత్రం మీతో ఉండనివ్వండి. ఒక్క రోజ కూడా నిన్ను చూడకుండ ఉండ లేను" అన్నాడు చక్రవర్తి బ్రతిమాలుతున్న దోరణిలో.

"లేదు నాన్న. నాకు నీతో ఉండటం ఇష్టమే. కాని నీ కోడలుకు రాధకు ఇష్టం లేదు. దానికి కారణం ఆమెకు మంచి కంపెనిలో ఉద్యోగం వచ్చింది. పొద్దున లేచి వంట పని చేసి ఎనిమిది గంటలకు ఆఫీసుకు వెళ్ళాలి. అంతటితో అయితే ఫర్వాలేదు. నిన్ను కూడా చూసుకోవాలి. వేళకు నీకు అన్ని అమర్చి పెట్టాలి. నీకు హోటల్ భోజనం సరి పోదు. ఖచ్చితంగా రోజు వంట చెయ్యాలి. ఒక్కోక్కో సారి ఆఫీసు నుంచి ఆలస్యంగా ఇంటికి వస్తుంది. అది నీకు చాల ఇబ్బంది కలగ వచ్చు. టైంకు భోజనం పెట్ట లేదని నువ్వు బాధ పడ వచ్చు. ఒక వైపు నిన్ను ఇబ్బంది పెడుతూ ఇంకో వైపు తను బాధ పడటం ఆమెకు ఇష్టం లేదు. అందుకే మిమ్మల్ని ఓల్డ్ ఏజ్ హోంకు పంపించాలని నిర్ణయించుకుంది. రాధ నిర్ణయం నాకు సబబు గానే తోచింది. మేమిద్దరం

ఉదయం వెళ్ళి పోతాం. రాత్రి తొమ్మిది గంటలకు కాని తిరిగి రాము. అంత వరకు నువ్వు ఒంటరిగా బిక్కు బిక్కు మంటి ఇంట్లో ఒక్కడివే ఉండాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. దీని వల్ల ఎవరికి ఇబ్బంది ఉండదు. నీకు హోం లో వేళకు కాఫీ టిఫిన్ భోజనం దొరుకుతుంది. ప్రతి నెల డాక్టర్ వచ్చి మీ ఆరోగ్యం సరిగ్గా ఉందో లేదో చూస్తాడు. నీతో మాట్లాడటానికి నీ వయస్సు వాళ్ళు తోడుగా ఉంటారు. నీకు టైం పాస్ అవుతుంది. వారానికి ఒక రోజు వచ్చి మేము చూసి వెళతాం. సరేనా."అన్నాడు రాజేష్.

"ఎవరు ఉన్నా నా అన్న వాళ్ళు లేని లోటు తీరుతుందా. దయ చేసి ఇంకో సారి కోడలు పిల్లకు చెప్పు. ఆమెకు సర్ది చెప్పటానికి ప్రయత్నించు."

"సారి నాన్న మా ఆలోచనలో ఎలాంటి మార్పు ఉండదు. రేపే నీ ప్రయాణం. సామానులు సర్దుకుని రెడిగా ఉండు" అని ఇంకో మాటకు అవకాశం ఇవ్వకుండ వేగంగా వెళ్ళి పోయాడు రాజేష్.

చక్రవర్తి హతాశుడయ్యాడు, నిస్సహాయంగా తన భార్య ఫోటో వైపు చూశాడు. ఆ మహా తల్లి అదృష్టవంతురాలు. ఈ దారుణం చూడకుండానే వెళ్ళి పోయింది. రాజేష్ కు అయిదు సంవత్సరాలు ఉన్నప్పుడు చక్రవర్తి భార్య హఠాత్తుగా చని పోయింది. అప్పటి నుంచి అతను తనే తల్లి తండ్రి అయి కొడుకును అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేశాడు. ఏది కోరిన కాదనకుండ తెచ్చి ఇచ్చాడు. తన నోరు కోరికలను అదుపు చేసుకుని కొడుకును బి.టెక్ చదివించాడు. ఉద్యోగం వచ్చిన సంవత్సరం తరువాత రాధను ఇచ్చి పెళ్ళి చేశాడు.

పెళ్ళి చూపులలో రాధను చూసి చక్రవర్తి కి సదభిప్రాయం ఏర్పడింది. చక్కగా సంప్రదాయంగా ఉన్న ఆమెను చూసి అతను చాల ముచ్చట పడ్డాడు. తన కొడుకుకు తగిన భార్య అని అప్పటికప్పుడే నిర్ణయించు కున్నాడు. రాజేష్ కూడా తండ్రి మాట కాదన లేదు. నెల రోజుల తరువాత రాజేష్ రాధ పెళ్ళి వైభవంగా జరిగింది.

కొత్త కోడలుగా రాధ ఇంట్లో అడుగు పెట్టినప్పుడు చాల మర్యాదగా ప్రవర్తించేది. చక్రవర్తిని చాల గౌరవంతో చూసుకునేది. అతనికి వేళకు కాఫీ టిఫిన్ భోజనం అమర్చేది. ఏది చెయ్యాలన్నా ముందు చక్రవర్తి అనుమతి అడిగేది. కట్టుకున్న భర్త కంటే అతని బాగోగులు గమనించేది. కోడలు ప్రవర్తన చక్రవర్తికి ఎంతో సంతోషం కలిగించింది. ప్రపంచంలో తన కంటే అదృష్టవంతుడు ఇంకోకడు లేడని లోపల మురిసి పోయాడు. ఎంతో అనుభవం జీవితం చూసిన చక్రవర్తి ఒక చిన్న విషయం మరచి పోయాడు. ఇంగ్లీష్ లో "న్యూ బ్రూమ్ స్టిక్ స్వీప్స్ వెల్ "అని సామేత ఉంది. దాని అర్థం కొత్త చీపురు బాగా ఉడుస్తుందని.

ఆ మాటలు రాధకు చక్కగా సరి పోతాయి. ఆరు నెలల తరువాత ఆమె ప్రవర్తన మారి పోయింది. అసలు రంగు బయట పడింది.

ప్రతి క్షణం అతన్ని చూసి విసుకునేది. అతను తమతో కలిసి ఉండటం వల్ల ఎంతో కష్టపడి పోతున్నట్టు ప్రవర్తించేది. అంతకు ముందు లాగా వేళకు టిఫిన్ కాఫీ ఇవ్వటం లేదు. చక్రవర్తి కిచెన్ లోకి వెళ్ళి తనే అడగాలి. భోజనం కూడా సమయానికి వడ్డించేది కాదు. ఆకలితో అతను నక నక లాడి పోతున్న పట్టించు కునేది కాదు. అన్ని పనులు పూర్తి చేసుకున్న తరువాత తీరికగా అతనికి వడ్డించేది.

కోడలు ప్రవర్తనకు బాధతో కుమిలి పోయేవాడు చక్రవర్తి. ఆమె ఎంత అవమానించిన తన లోనే దాచుకునే వాడు కాని కొడకుకు చెప్పేవాడు కాదు. అన్ని అవమానాలు చీదరింపులు తన లోనే దాచుకునే వాడు. కొడుకు తనతో ఉంటున్నాడన్న సంతోషం అతని బాధలను డామినెట్ చేసింది. ఇంకో ఆరు నెలల తరువాత ఆ సంతోషం కూడా అతనికి దూరమైంది. ఉన్నట్టుండి రాధకు ఉద్యోగం చెయ్యాలనే కోరిక కలిగింది. ఆ విషయం వెంటనే భర్త చెవిలో వేసింది. సంతోషంతో సరే అన్నాడు రాజేష్. ఆమె అదృష్టమో చక్రవర్తి దురదృష్టమో ఆమెకు వెంటనే మంచి కంపెనిలో ఉద్యోగం వచ్చింది. అదే చక్రవర్తిని కొడుకుకు దూరం చెయ్య బోతుంది.

ఆ రాత్రంతా చక్రవర్తి నిద్ర పోలేదు. కొడుకు ప్రవర్తన తలుచుకుని కుమిలి పోయాడు. మరునాడు ఉదయం అందురు టాక్సిలో ఓల్డ్ ఏజ్ హోంకు బయలు దేరారు. మేకను బలి ఇచ్చే ముందు బాగా అలంకరించి మంచి తిండి పెడ్తారు. అలాగే చక్రవర్తిని ఓల్డ్ ఏజ్ హోంకు పంపించటానికి కావల్సిన బట్టలు సామానులు రాజేష్ స్వయంగా కొనుక్కుని వచ్చాడు.

అర గంట తరువాత కారు ఒక ఓల్డ్ ఏజ్ హోం ముందు ఆగింది. చక్రవర్తి ముందు దిగి లోపలికి వెళ్ళాడు. రెండు నిమిషాల తరువాత రాజేష్ రాధలు అతని సామానులు తీసుకుని లోపలికి వెళ్ళారు. లోపల చక్రవర్తి ఆ ఓల్డ్ ఏజ్ హోం యజమానితో నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఇద్దరికి చాల కాలం నుంచి పరిచయం ఉన్నట్టు కనిపిస్తోంది.

“ఫాదర్ డానియల్ మీరిద్దరికి చాల కాలం పరిచయం ఉన్నట్టుగా మాట్లాడుకుంటున్నారు. చక్రవర్తిగారు మీకు ముందే తెలుసా”ఆశ్చర్యంగా అడిగాడు రాజేష్.

“సరిగ్గా పదిహేను సంవత్సరాలకు ముందు చక్రవర్తి గారు ఈ హోంనుంచి ఒక అయిదుసంవత్సరాల పిల్లవాడిని పెంచుకోవటానికి తీసుకువెళ్ళారు. ఇప్పుడు ఆ అబ్బాయి ఏం చేస్తున్నాడని అడుగుతున్నాను”అన్నాడు డానియల్. నెత్తిమీద అటంబాంబు పడినట్టు కట్రయిలా బిగుసుకుపోయాడు రాజేష్. రాధ మొహం సున్నం కొట్టినట్టు తెల్లగా పాలిపోయింది.




ప్రముఖ రచయిత్రి సృజన కలంనుంచి వెలువడిన కథల సంపుటి 'జీవన రాగాలు ......'. సృజన గారి రచనలంటే నా కెంతో ఇష్టం. వాస్తవానికి దర్పణం పట్టినట్లు ఉంటాయి ఆవిడ రచనలన్నీ. గబగబా పని పూర్తి చేసుకుని పుస్తకం చేతిలోకి తీసుకుని చదువుదామని తెరిచాను. మొదటి కథ 'కల్పన' ...

***************

కవిత, కల్పన ఇద్దరు కాకినాడలో ఒకే కాలేజీలో బి.ఎస్సి ., చదువుతున్నారు. హాస్టలులో ఒకే గదిలో ఉంటున్నారు త్వర లోనే గాఢ స్నేహితులయ్యారు. వీలయితే ఒక సారి వచ్చి వెళ్ళమని ఇంటి దగ్గర నుండి ఫోన్ వస్తే 3 రోజులు సెలవలు కలిసి వచ్చాయని ఇవాళ ఉదయమే సామర్ల కోట తన ఇంటికి వచ్చింది కవిత. భోజనం చేసి కొంచం సేపు పడుకుందామని అనుకుంటుండగా మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో ఫోన్ వచ్చింది కల్పన వద్ద నుండి.

'అదేమిటి పొద్దునే కదా మాట్లాడాను ఎన్నో కబుర్లు చెప్పింది మళ్ళీ ఇంతలో ఫోనెందుకు చేస్తోంది?' అనుకుంది కవిత.

‘మూడు రోజులు సెలవలు కదా నువ్వు కూడా ఇంటికి వెళ్ళ కూడదా?’ అన్నప్పుడు కల్పన అయిష్టంగా తలూపి మౌనంగా ఉండి పోయింది. సరే లేమ్మని కవిత కూడా మరి రెట్టించ లేదు. కాని గత వారం అత్యవసరమైన పని పడి ఇంటికి వెళ్ళివచ్చినప్పటి నుంచి కల్పన ఎక్కువ సమయం ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఉండటం కవిత గమనిస్తూనే ఉంది . ఏదైనా ఉంటే తానే చెప్తుందిలే అని ఎదురు చూస్తోంది కవిత.

“హలో కల్పనా! ఏమిటే అంత కొంప మునిగి పోయే పని పొద్దున్నే గా మాట్లాడుకున్నాము. ఇంతలో ఏమైంది? అప్పుడే నా మీద బెంగ పెట్టుకున్నావా” ఆట పట్టిస్తున్నట్లుగా అడిగింది కవిత.

కానీ “హలో! ఎవరు మాట్లాడుతున్నారు?” అని విన వచ్చిన ప్రశ్నకు కొంత ఆందోళన చెంది “హలో! మీరెవరు? నేను కవితను . ఇది నా స్నేహితురాలు కల్పన ఫోను , మీ దగ్గరికెలా వచ్చింది?” అంది గబ గబా

“నేను ఇన్స్పెక్టర్ రాగిణిని మాట్లాడుతున్నాను. మీ స్నేహితురాలు కల్పన ఫోన్ లో మొదటగా మీ నంబరే ఉండటంతో మీకు కాల్ చేస్తున్నాను”

“ఇన్స్పెక్టర్ గారా , కల్పన కేమైంది? దయ చేసి చెప్పండి”

“మీ స్నేహితురాలు కల్పన ఆత్మహత్యకు పాల్పడింది. పరిస్థితి విషమంగా ఉంది ” అని అవతల నుంచి వినగానే

“ఏమిటీ” అని పెద్దగా కేక పెట్టింది కవిత . ఆ అరుపుకు ఇంట్లో వాళ్ళంతా బెదిరి పోయి ‘ఏమైంది ఏమైంది’ అంటూ పరుగెత్తి వచ్చారు. విషయం వాళ్ళకి వివరించి ఇంకా సరిగ్గా తెరవ నైనా తెరవని బ్యాగుని అలాగే మళ్ళీ భుజాన వేసుకుని పర్సు చేత బట్టుకుని పరుగున బస్టాండుకి వెళ్ళి బస్సెక్కి కాకినాడ తిరుగు ప్రయాణమైంది. దారి పొడుగునా ఏమై ఉంటుందా, కల్పనకి ఆత్మహత్య చేసుకో వలసిన అగత్యం ఎందుకు వచ్చిందా అనే ఆలోచిస్తూ ఉండి పోయింది. తన ప్రాణ స్నేహితురాలు ఈ మధ్య కొంచం దిగులుగా ఉండటం గమనించింది కానీ ఎప్పుడు నవ్వుతూ అందరితో సరదాగా ఉండే కల్పన ఇంత పని చేస్తుందనుకోలేదు. బయటకు చెప్పుకో లేని బాధేదో ఆమెని లో లోపల కలచి వేసిందా?

బస్సు దిగి హాస్టలుకి వచ్చేటప్పటికి అక్కడంతా గందర గోళంగా ఉంది. ఇన్స్పెక్టర్ రాగిణి వార్డెనుని ప్రశ్నిస్తున్నారు. కవిత రావడం చూసిన ఆవిడ "మేడమ్ ఈ అమ్మాయే కవిత, కల్పన స్నేహితురాలు. ఈమె తోనే మీరు ఫోన్ లో మాట్లాడారు" అంటూ కవితని రాగిణికి పరిచయం చేశారు.

"నమస్తే మేడమ్" అంది కవిత. కవిత వచ్చేటప్పటికే హాస్టలు నిర్వాహకురాలిని అడిగి కల్పన ఇంటికి సమాచారం పంపే ఏర్పాట్లు చేసింది రాగిణి.

ఆ తరువాత " ఏమ్మా నీ స్నేహితురాలు కల్పన ఆత్మహత్యకు పాల్పడడానికి కారణం ఏమైఉంటుందో నువ్వేమైనా చెప్ప గలవా?" అని కవితను ప్రశ్నించింది.

"అదే నాకు అర్థం కావడం లేదు మేడమ్. కల్పన ఎప్పుడు అందరితోనూ చాలా సరదాగా ఉంటుంది. ఒక వేళ ఏమైనా ఉంటే నాతో తప్పక చెప్తుంది. అలాంటిది ఇలా ఎందుకు చేసిందో నాకు కూడా అంతు బట్టటం లేదు మేడమ్" అంటుండగానే కవితకి దుఃఖం తన్నుకు వచ్చి వెక్కడం మొదలు పెట్టింది. అంత లోనే ఏదో గుర్తుకు వచ్చి వెంటనే తమాయించుకుని "మేడమ్ ఒక విషయం " అంది

"ఏమిటమ్మా?"

"గత వారం కల్పన ఏదో అత్యవసరమైన పని ఉందని వాళ్ళ ఊరు వెళ్ళి వచ్చింది. అప్పటు నుండి ఎందుకో కొంచం దిగులుగా ఉండటం గమనించాను"

"స్నేహితురాలు దిగులుగా ఉంటే విషయం కనుక్కోవడానికి నువ్వు ప్రయత్నించ లేదా?"

"అడిగాను మేడమ్ కానీ ఏమి లేదని చెప్పి మాట దాట వేసింది. నేను మరి రెట్టించి అడగ లేదు. అదే నేను చేసిన పొరపాటని ఇప్పుడు ఎంతో బాధ పడుతున్నాను అంటూ కళ్ళమ్మట ఏకధారగా కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ జీరబోయిన గొంతుతో ఏదైనా చెప్పేదుంటే తానే చెప్తుందిలే అనుకున్నాను. ఇంతలో నేను కూడా ఊరుకి వెళ్ళాల్సి రావడంతో వచ్చాక అడగొచ్చులే అనుకుని దిగులు పడొద్దని మాత్రం చెప్పి వెళ్లాను. ఇలాంటిదేదైనా జరుగుతుందని ఏమాత్రం ఊహించినా కల్పనని ఒంటరిగా వదిలి వెళ్లి ఉండేదాన్నే కాదు" అంటూ ఏడవ సాగింది. అప్పుడు రాగిణి ప్రక్కనే ఉన్న ఇంకో మహిళా

కానిస్టేబులుకి కవితను అవతలికి తీసుకెళ్ళి మంచి నీళ్ళు త్రాగించ మని సైగ చేసింది.

ఇంతలో ఇంకో కానిస్టేబులు “మేడమ్” అంటూ వచ్చాడు.

“ఏమిటి భద్రయ్యా?”

“ఆ అమ్మాయి పెట్టెలో ఇది దొరికింది” అంటూ ఒక కవరు రాగిణి చేతికి అందించాడు

ఆ కవరుపై ‘నా ప్రాణ స్నేహితురాలు కవితకు’ అని వ్రాసి ఉంది.

ఆవిడ దానిని “నీ స్నేహితురాలు నీకు ఏదో ఉత్తరం వ్రాసి పెట్టినట్లుంది. ఏమి వ్రాసిందో చదివి చెప్పు” అంటూ కవితకి అందించారు. గబ గబా కళ్ళు తుడుచుకుని కవరు తెరిచి అందులో ఉన్న మూడు కాగితాలు బయటకు తీసింది. ఉత్తరం చూసి కవిత ముఖంలో భావోద్వేగం గమనించింది రాగిణి. ఉత్తరం చదవసాగింది కవిత .........

“ప్రియాతి ప్రియమైన కవీ! (కవితను ప్రేమతో ‘కవీ’ అని పిలవడం అలవాటు కల్పనకు), ఈ ఉత్తరం నీకు చేరేటప్పటికి నేను ఈ లోకంలో ఉండను. ఇది చదివితే నేనిలా చేయడానికి కారణమేమిటో నీకు అర్థమవుతుంది .

ఇన్ని సంవత్సరాలుగా ఈ బాధని నాలోనే దాచుకుని ఎంత మానసిక క్షోభని అనుభవించానో నాకే తెలుసు. నా పట్ల ఏమి జరుగుతోందో అర్థమయ్యేటప్పటికే చాలా ఆలస్యమై పోయింది. ఈ విషయం ఎవరికి, ఎలా, ఏమని చెప్పాలి .........ఈ ప్రశ్నలు అహర్నిశలు నన్ను వేధిస్తూ ఉండేవి.

అమ్మతో చెబితే? నాన్ననే దైవంగా కొలుస్తూ ఆయన గురించి ఎవరేమైనా ఒక్క మాట అంటే కూడా సహించని అమ్మ నా మాటలు నమ్ముతుందా? నేను చెప్పేది విన్నాక నాకు తోడుగా నిలబడుతుందా? ఎప్పుడూ క్లబ్బులని , సమావేశాలని తిరుగుతూ ఉండే అమ్మ, పేరు ప్రతిష్ఠలకే ప్రాముఖ్యత నిచ్చే అమ్మ ... ఈ విషయం విని తట్టుకో లేక తనకి తాను ఏదైనా హాని తల పెట్టుకుంటే ఇప్పుడిప్పుడే యుక్త వయసు లోకి వస్తున్న చెల్లి ఆరు సంవత్సరాల తమ్ముడు.. వాళ్ళకు దిక్కెవ్వరు?

పోనీ నాన్ననే అడిగితే ? ......హు! నాన్న ! ఆ పదానికే కళంకం తెచ్చిన వ్యక్తితో మాట్లాడాలంటేనే నాకు అసహ్యంగా అనిపించింది . అసలు నా మనో వ్యధకి కారణం ఆ వ్యక్తే గదా???

పిల్లలు తమకేమైనా కష్టం కలిగితే తల్లి దండ్రులకు చెప్పుకుంటారు. అలాంటిది కన్న తండ్రే పిల్లలకి హాని తల పెడితే? సంతానాన్ని దుష్టుల నుండి కాపాడి రక్షించ వలసిన తండ్రే మృగంలా కూతుర్ని కబళించాలని చూస్తే ఇంక ఆ వ్యక్తికి తండ్రి అని పిలిపించుకునే అర్హత లేదు. నాకు ఊహ తెలిసి జరుగుతున్న దారుణం అర్థమై కొంత వరకు జాగ్రత్త పడగలిగాను. కానీ మొన్న అనుకోకుండా పని మీద ఇంటికి వెళ్లినప్పుడు అదే అఘాయిత్యం ఆ వ్యక్తి నా చెల్లెలి పట్ల కూడా చేయ బోవడం చూసి నా మనసు వ్యధతో క్రుంగి పోయింది. ఇంకా ఉపేక్షిస్తే నా చెల్లెలి జీవితం కూడా అఘాయిత్యం పాలవుతుందని అనిపించింది. నేను మాటల్లో చెప్తే ఎవరు నమ్ముతారు ? ఏ విషయాన్ని సాక్ష్యం ఉంటేనే గాని నమ్మని మన వ్యవస్థలో ఇది నిజమని నిరూపించడం ఎలా ? అందుకే చెల్లికి కొంచం జాగ్రత్తగా ఉండమని చెప్పి వచ్చాను. కానీ ఎలా , ఎన్నాళ్ళు నేను ఇక్కడ ఉంటూ అక్కడ చెల్లిని కాపాడ గలను? అందుకే నీకు ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నీ నుండి ఒక సహాయం కోరుతున్నాను.

అది చెప్పే ముందర నీ మనసులో వచ్చిన సందేహం "నేను చని పోవడమెందుకు, ధైర్యంగా ఈ పరిస్థితిని ఎదుర్కొని ఉండ వచ్చు కదా అని' .. చదువుతున్న కవిత అప్రయత్నంగానే పైకి 'అవును' అనేసి .....తలెత్తి ఒక సారి రాగిణి కేసి చూసి తిరిగి ఉత్తరం చదవ సాగింది......

'నాకు జీవించాలనే ఇచ్ఛ నశించింది. దుర్మార్గుడైన ఆ వ్యక్తిని అమ్మ దైవంలా పూజిస్తుంటే చూస్తూ ఈ జన్మ గడపలేను. పది మందిలో దేవుడని పేరు తెచ్చుకుని ఇంట్లో కన్న కూతుర్లని కామించే ఆ వ్యక్తిని నా తండ్రిగా భావించి సమాజం కోసం నటిస్తూ బ్రతకాలని లేదు. అందుకే ఈ లోకం వదిలి వెళ్ళి పోవాలని నిశ్చయించు కున్నాను. కానీ నేను అనుభవించిన మానసిక క్షోభ వేరే ఏ కూతురు అనుభవించ కూడదు. మంచి మనుషులనే ముసుగు వేసుకుని సంఘంలో చెలామణి అవుతూ కన్న కూతుర్లని కామ పిశాచుల లాగా కబళిస్తున్న ఇలాంటి ఎంతో మంది మృగాలకి కఠినమైన శిక్ష పడాలి. నా చావుకి కారణం నా కన్న తండ్రే, నా చెల్లెలిని కబళించాలని చూసిన ఆ వ్యక్తికి శిక్ష పడేలా చూడు. ఇదే నా ఆఖరి కోరిక . తప్పక తీరుస్తావు కదూ !

జన్మ జన్మలకు నీవే నా నెచ్చెలివి కావాలని కోరుకుంటూ నిన్ను వదిలి వెళుతున్న

నీ ప్రియమైన

# కల్పన

ఉత్తరం చదవ గానే 'కల్పనా ఎంత పని చేసావే!' అంటూ పెద్దగా ఏడుస్తూ కుప్ప కూలి పోయింది కవిత. ఆమె పరిస్థితి చూసి అక్కడున్న వాళ్ళందరికీ కూడా కన్నీళ్ళాగలేదు. ప్రక్కనే నిలబడి, కవిత సొంతం ఉత్తరం చదివాక ఏమి వ్రాసిందో అడిగి తెలుసు కుందామని ఎదురు చూస్తున్న రాగిణి స్పృహ కోల్పోయి నేలకి ఒరిగి పోతున్న కవితను గభాలున పట్టుకుని ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుండ బెట్టి ఆమెను జాగ్రత్తగా చూడమని అక్కడున్న కానిస్టేబులుకి చెప్పింది. తదుపరి కవిత చేతి లోంచి జారి పడిన ఉత్తరాన్ని చదివిన రాగిణికి కూడా అంతు లేని దుఃఖం అంతకు మించిన ఆగ్రహం పెల్లుబికి వచ్చాయి.

కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచాడని ఆత్మహత్యా ప్రయత్నం చేసినప్పటికీ కల్పన మరణించ లేదు. డాక్టర్ల ప్రయాసతో ప్రాణాపాయం నుండి బయట పడింది. వెంటనే రాగిణి పై అధికారుల ఆదేశాలకి మేరుగా కల్పన నుండి వాగ్మూలం తీసుకుంది. ఆ సాక్ష్యాలతో కల్పన తండ్రిని వెంటనే అదుపులోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయించింది.

విషయం తెలిసి హుటా హుటిన వచ్చిన కల్పన తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది . "ఒక్క సారి నన్ను నమ్మి ఈ విషయాన్ని నాతో చెప్పి ఉంటే దుర్మార్గుడైన నీ తండ్రికి నేనే శిక్ష పడేలా చేసేదాన్ని" అంటూ వాపోయింది కూతురుని చూసి.

కల్పన తండ్రిపై ఆరోపణలు సాక్ష్యాధారాలతో సహా రుజువు కావడంతో అతనికి కోర్టు కన్న కూతురు కల్పనని ఆత్మ హత్యకు పురి కొల్పేలాగా మానసిక శారీరిక హింసకు గురి చేసినందుకు, చిన్న పిల్ల కల్పన చెల్లెలిని బలాత్కారం చేయడానికి పూనుకున్నందుకు గాను శిక్షా స్మృతుల ప్రకారం కఠినాతి కఠినమైన శిక్ష విధించింది.

ఆస్పత్రిలో కోలుకుంటున్న ప్రాణ స్నేహితురాలైన కల్పనను పరామర్శించడానికి వెళ్ళిన కవిత "చూడు నువ్వు కోరుకున్నట్లుగానే నీ తండ్రికి శిక్ష పడింది. ఇంక నీ జీవితానికి , నీ చెల్లెలి జీవితానికి ఏమి భయం లేదు. ఇప్పుడు మీ అమ్మ గారు కూడా నీ వెంటే ఉంటారు. ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చిపని చేయవు కదూ" అంటూ స్నేహితురాలి చేతులు పట్టుకుని ఆప్యాయంగా నిమిరుతూ చెమ్మ గిల్లిన కళ్ళను తుడుచుకుంది .

ఒక వైపు తల్లిని, చెల్లెలిని, తమ్ముడిని ఇంకోవైపు ప్రాణ స్నేహితురాలైన కవితను చూసి జీవితం పట్ల తిరిగి ఆశ చిగురించగా తృప్తిగా కళ్ళు మూసుకుంది కల్పన.

*******************************

కథ పూర్తయ్యింది. నా మనసు కూడా భారమైంది. నేటి సమాజంలో కల్పనలాంటి అమ్మాయిలు ఎంత మందో? కాని ఎంత మంది కల్పనలాగా ఇలాంటి విషయం బయటకు చెప్ప గలుగుతున్నారు? సమాజంలో పరువు ప్రతిష్ఠలు దెబ్బ తింటాయని ఝడిసి ఎంతో మంది కిమ్మన కుండా ఉండి పోతున్నారేమో?

ఇలాంటి అత్యాచారాలను సహిస్తూ పిరికి తనంతో తమకు తామే హాని తల పెట్టుకో కుండా ధైర్యముగా ఎదుర్కోవాలని సూచిస్తున్నట్లుగా, కల్పన పాత్రను బ్రతికించి దుర్మార్గుడైన ఆమె తండ్రికి శిక్ష పడేలా చూపి, కథకు చక్కటి ముగింపును ఇచ్చి ఒక మంచి సందేశాన్ని అందించిన రచయిత్రి సృజనా శక్తికి మనసు లోనే అభినందనలు తెలియ జేశాను.



"మీరు ఎం చేస్తారో నాకు తెలియదు. ప్రభుత్వ బడులు మూత పడగూడదు. హాజరు పెరుగాలి. డ్రాప్ అవుట్స్ తగ్గాలి. వూళ్ళో ఉన్న పిల్లలందరూ మీ బళ్లోనే చదవాలి. ఉత్తీర్ణత శాతం పెరగాలి....." జిల్లా విద్యా శాఖాధికారి అలా చెప్పుకుంటూ పోతూనే వున్నాడు. ఆ సమావేశానికి వచ్చిన ప్రధానోపాధ్యాయులందరూ శ్రద్ధగా వింటూనే వున్నారు. చివరికి విద్యాశాఖాధికారి "ప్రజల ముందు, ప్రభుత్వం దగ్గర మన పరువు పోతోంది. దానిని నిలబెట్టే బాధ్యత మీదే!" అంటూ ముగించాడు.

ప్రధానోపాధ్యాయుడు తిరిగి వచ్చాక బడిలో ఉపాధ్యాయులను అందరిని సమావేశపరిచి, వివరాలు అన్నీ తెలియజేసి, ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి తక్షణమే దానిని అమలులో పెట్టాడు.

ఒక నెల రోజులలో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. పరిసరాలన్నీ శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రంగులు వేయించారు. బడి ఎగవేస్తున్న పిల్లలను గుర్తించి, వాళ్ళ తల్లితండ్రులతో మాట్లాడి వాళ్ళు చెప్పే సమస్యలు విని తమకు తోచిన పరిష్కారాలు సూచించారు. బోధనా ప్రమాణాలు పెరిగాయి. తమ వూరి బడిలో వచ్చిన మార్పుకు వూళ్ళో వాళ్ళంతా చాలా ఆశ్చర్య పోయారు.

ఆ తర్వాత ప్రణాళికలో భాగంగా గ్రామంలో ప్రభుత్వ బడిలో కాకుండా యాజమాన్య బడిలో చదువుతున్న పిల్లల వివరాలు సేకరించి, వాళ్ళ తలిదండ్రులతో మాట్లాడి వాళ్ళను తిరిగి ప్రభుత్వ బడిలో చేర్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రతిరోజూ బడి వదలగానే ఒక గంట ఇందుకోసం కేటాయించి ప్రత్యేకమైన శ్రద్ధతో ఆ పని చేస్తున్నారు. అందులో నరేంద్ర అనే ఉపాధ్యాయునికి ఒకరోజు ఊహించని అనుభవం ఎదురయింది.

నరేంద్ర తను చేయవలసిన పనిలో భాగంగా ఒక ఇంటికి వెళ్లి ఆ వూరికి దూరంగా యాజమాన్య బడిలో చదువుతున్న పిల్లవాడి తల్లిదండ్రులతో మాట్లాడి, వాళ్ళ పిల్లవాడిని యాజమాన్య బడి మాన్పించి ప్రభుత్వ బడిలో చేర్పిస్తే కలిగే సదుపాయాలూ వివరించి, నిదానంగా వాళ్లకు నచ్చజెప్పి వాళ్ళ పిల్లవాడిని ప్రభుత్వ బడిలో చేర్పించడానికి ఒప్పించాడు. అంతలో బయటికి వెళ్ళిన ఆ పిల్లవాడి తాత ఇంటికి తిరిగి వచ్చాడు. జరిగిన సంగతి విని, నరేంద్రతో మాటలు కలిపాడు. వూరి ప్రభుత్వ బడిలో వచ్చిన మార్పులకు చాలా హర్షం వ్యక్తం చేశాడు. నరేందర్ చాలా ఉల్లాసంగా ఆయనతో కబుర్లు చెప్పసాగాడు. అంతలో ఆయన నరేంద్ర పిల్లలు ఎక్కడ వున్నారు ఎం చదువుతున్నారు వంటి వ్యక్తిగత వివరాలు అడిగాడు. నరేందర్ రెట్టించిన ఉత్సాహంతో చెప్పుకొచ్చాడు. తమ పిల్లలు చాలా తెలివైన వాళ్ళని వాళ్ళు నగరంలో అంతర్జాతీయ పాఠశాలలో చదువుతున్నారని, ఎప్పుడూ మొదటి స్థానంలో ఉంటారని ఇంకా తమ పిల్లల ప్రతిభకు సంబంధించి వింత వింత విశేషాలన్నీ చెప్పసాగాడు.

పిల్లవాడి తాత అన్నీ శ్రద్ధగా విని మాటల సందర్భాన్ని మార్చి తన చిన్నప్పుడు ఆ వూళ్ళో జరిగిన ఒక సంఘటన చెప్పుకొచ్చాడు: 'నా చిన్నప్పుడు రెండేళ్ళు వరుసగా వర్షాలు పడక ఈ వూళ్ళో చాలా పెద్ద కరువు వచ్చింది. అప్పుడు ఒక పెద్ద

శాస్త్రవేత్త వూరికి దూరంగా వున్న గుట్టమీద ఒక యజ్ఞం చేస్తే వెంటనే విపరీతంగా వర్షాలు పడతాయని చెప్పాడు. ఊరిపెద్ద యజ్ఞానికి అన్ని ఏర్పాట్లు చేశాడు. జనం తండోపతండాలుగా వెళ్తున్నారు. నేను కూడా ఒక గొడుగు తీసుకొని బయలుదేరాను. నా చంకలో గొడుగు చూసి ఊరి పెద్ద "అదేమిటోయ్! వాన ఏమీ రావడం లేదు కదా! చంకలో ఆ గొడుగెందుకు?" అని అడిగాడు. "అదేమిటి మనం యజ్ఞం చేయడానికి వెళ్తున్నాం కదా! వచ్చేటప్పుడు వర్షం పడితే తడవాల్సి వస్తుందనీ..." అంటూ నసిగాను.

దానికి ఊరి పెద్ద పెద్దగా నవ్వి" బాగుందిరా నీ యవ్వారం మనం ఆ కొండమీదకు వెళ్ళడం, యజ్ఞం చేయడం, వర్షం రావడం .... భలే వుంది ..భలే వుంది ఇదంతా జరిగే పనేనా?"అంటూ చాలా ఎగతాళిగా నవ్వాడు. అప్పుడు నేను "మరి అంతమాత్రానికి అంత దూరం పోయి యజ్ఞం చేయడం ఎందుకు?" అని అడిగాను. ఊరి పెద్ద టక్కున ఆగిపోయి నాకు జవాబు చెప్పలేక ముందుకు వెళ్ళిపోయాడు.'

తాత చెప్పడం ఆపి నరేంద్ర వంక చూసి "ఇదంతా నేను ఎందుకు చెప్పానో నీకేమయినా అర్థమైందా?" అని అడిగాడు. నరేంద్రకు చూచాయగా అర్థమైంది. అతను లేచి నిలబడ్డాడు. "వాస్తవానికి ఇది నేను చిన్నప్పుడు చదివిన కథ. నీకు బాగా అర్థం అవడానికి మా వూళ్ళో జరిగినట్టుగా చెప్పా. చూడు! మనిషికి చేసే పని మీద విశ్వాసం ఉన్నప్పుడే ఆ పని సమర్థవంతంగా చేయగలుగుతాడు. మీ ప్రభుత్వ బడి గురించి ఓ.. ఇంత పొడుగు చెప్పావు కదా! మీ బడి సామర్థ్యం మీద మీకు విశ్వాసం ఉంటే, మీ పిల్లలను తీసుకొచ్చి చేర్పించు ఆ మరునాటి నుండి నా మనుమడు మీ బడికి వస్తాడు."




నాన్న నేనిప్పుడే చెబుతున్న ఇవన్నీ నేను పోగేసుకున్న డబ్బులు కార్తీక పౌర్ణమి కి టపాసులు కొనుక్కుంటా , నేనొక్కడినే కాలుస్తా విశ్వధర్ , వాడి వయస్సు పది సంవత్సరాలు, మహా పొదుపరి, వాడు దేనికోసం పని మొదలుపెట్టాడో అది అయ్యేవరకు వదలకుండా పట్టు పట్టే మొండి వాడు , అలా అని అల్లరివాడు కాదు, ఆలోచన పరుడు అన్ని ఆలోచించి నిర్ణయించుకుంటాడు, కాని మొండి వాడు మొన్న దీపావళి రోజున టపాసులు కావాలని బాధ పడితే అది చూడలేక ఫ్రెండ్ దగ్గిర అప్పు చేసి మరి వాడి కోరిక తీర్చాను, దీపావళి రోజు వాడికి అత్తయ్యలు , మామయ్యలు, వరసకి బంధువులు ఇనాము గా ఇచ్చిన డబ్బులు దాచుకుని మళ్ళీ ఈ రోజు ఆ డబ్బుల్ని తగలెయ్యాలని పట్టుకుకూర్చున్నాడు .

*******************************************

కార్తీక పౌర్ణమి , ఈ రోజు పొద్దున్న వాడి ఇనాము మనీ జేబులో పెట్టుకుని ఎదురుచూస్తున్నాడు , టపాసులు ఎప్పుడు కొనుక్కుందాం , ఎప్పుడు కాలుద్దాం అని , " నాన్న ఉదయం తొమ్మిదింటికి షాపుకి వెళ్లి టపాసులు కొనుక్కుందాం అన్నావుకదా , తొమ్మిదయింది పదా " వాడి కోరిక నాకు తీర్చాలని లేదు , అనవసరం అనిపించింది , కానీ వాడిని కోపగిస్తే చిన్న మనసు బాధ పడతాడేమో నని . . . . . .

" పదా డాడీ "      వాడి పిలుపుతో ఆలోచనలోంచి తేరుకున్నాను ,          ఇక వాడు ఆగడని అర్ధమైంది , ఇద్దరం స్కూటర్ పైన బయలుదేరాం . వెళుతుంటే     దారి లో     ఒక అనాధ బాలల ఆశ్రమ నిర్వాహకులు     అనాధ పిల్లలని ఒక ఇరవై మంది వరకు ఉంటారు, పోగేసుకుని ప్రార్ధన గీతాలు ఆలపిస్తూ     వారి అనాధ జీవితాన్ని వర్ణించే గీతాలు పాడుతూ చందాలు పోగేసుకుంటూ వెళ్తున్నారు, దారిన వెళ్ళే వారు     కొంతమంది అదేదో వింత చూస్తున్నట్లు , కొంత మంది పట్టనట్లు, కొంత మంది తోచిన విధంగా డబ్బు సాయం అందిస్తూ     ఉన్నారు.

ఈ దృశ్యం మా వాడి కంట పడింది, ఇది వాడికి కొత్త సంఘటన ఇప్పటివరకు చూసి ఉండక పోవడం వల్ల అదే పనిగా వారినే చూస్తూ ఉండి పోయాడు, మేము అనాధ పిల్లల గుంపుని దాటి ముందుకు సాగి పోతున్నాం,      "నాన్న "      కొంచెం గంభీరంగా పిలిచాడు, నాకు కొత్తగా ఉందా పిలుపు ,     ఏంటి నాన్న     ?     అన్నాను ,     ఇందాక ఆ పిల్లలు పాటలు పాడుతూ చెందాలు పోగేస్తున్నారు కదా ,ఎందుకలాగా, వారికి అమ్మ     నాన్నలు లేరా ? మరి వారిని ఎవరు     . . . . . . . . ఆగాడు , వాడి సందేహం నాకు అర్ధం అయింది .

ఇప్పుడు వాడు పూర్తి వివరాలు తెలిసే వరకు వదలడు     నాకు తెలుసు, స్కూటర్ ముందుకి సాగుతూనే ఉంది ,     నేను కొనసాగించాను,     ఏమి లేదురా ,

తల్లి తండ్రులు చనిపోయిన వారిని,       తమ తప్పుల్ని పిల్లల     రూపం లో వదిలించుకుని వెళ్ళిన పిల్లల్ని , తప్పి పోయిన పిల్లల ని , ఆ అనాధాశ్రమం వారు చేరదీసి , వారి బాగోగులు అన్ని పెద్దయ్యే వరకు చూసుకుంటారు, ఆ పిల్లలకి చదువు, బట్టలు, భోజనం , తదితర సౌకర్యాలు కల్పించడానికి డబ్బు కావాలి కదా , పాపం ఆశ్రమం వాళ్ళకి అంత డబ్బు ఎక్కడి నుండి తెస్తారు , నీలాగా వాళ్లకి అప్పుతెచ్చి దీపావళికి టపాసులు, కొత్త బట్టలు తెచ్చి పెట్టె తల్లి తండ్రులు లేరు కదా ?     అని ఆగాను , వాడి మొఖం లో వింత ఏక్సప్రెషన్     చూసాను , నేను చెప్పిన అనాధ బాలల విషయం , నేను అప్పుచేసి కొన్న టపాసుల విషయం     ఒకేసారి బోధ పడ్డట్టుగున్నయ్ వాడికి . . . . . . . ,

కాస్త తట పటాయించి ....... "అందుకే ఇలా చందాలు పోగేసుకుని     దయయున్నవారు ఇచ్చిన డబ్బు తో ఆ పిల్లలని సాకుతారు " .. .

నేను చెప్పడం ఆపాను , వాడు       ఉకొట్టడం ఆగింది , బండి ముందుకు సాగి పోతుంది, కాసేపు మా మధ్య నిశ్శబ్దం అలుముకుంది. టపాసులు అమ్మే షాప్ ముందు బండి ఆపాను, విశ్వధర్     బండి దిగ లేదు, వాడు ఇంకా అనాధ పిల్లల ఆలోచన లోంచి బయట పడ లేదు ,     నేను ఏదో అనే లోగానే .. . . . . . . , నాన్న అంటే ఆ పిల్లలకి పండక్కి కొత్త బట్టలు, టపాసులు ,

ఏమి ఉండవు కదా ? నేను ఇంకా ఏమి అనకుండానే , నాన్న మనం అనాధాశ్రమం పిల్లలని చూసాం కదా వాళ్ళ దగ్గరికి వెళదాం , నా డబ్బులు వాళ్లకి ఇచ్చేస్తాను, నేను టపాసులు కాలిస్తే, నేనొక్కడినే కదా సంతోషిస్తాను ,

కానీ ఈ డబ్బు వాళ్లకి డొనేట్ చేస్తే అందరికి ఎంతో కొంత సాయంగా ఉంటుంది కదా వాళ్లంతా సంతోషిస్తారు .విశ్వ మాట్లాడుతుంటే నా నోటా మాట రాలేదు, ఇంత చిన్న వయసులో ఎంత పెద్దగా ఆలోచించావురా అనుకున్నాను మనసులో , మరి ఇన్ని రోజులుగా టపాకాయల కోసం దాచుకున్నావు కదారా డబ్బులు అన్నాను, నన్ను మాట్లాడనివ్వకుండా వాళ్లు వెళ్లి పోతారు నాన్న త్వరగా పదా వాళ్ళని పట్టుకుందాం తొందర పెట్టాడు.

బండి స్టార్ట్ చేసి వేగంగా ఆ గుంపు వెళ్లిన వయిపు సాగాము .

*******************************************

ఉన్న డబ్బంతా అనాధ పిల్లలకు ఇచ్చావు , మరి నీ పరిస్థితి ఏంటిరా ? అడిగాను . "నాకు మీరున్నారు కదా నాన్న , అప్పు చేసైనా మా కోరికలు తీరుస్తారు " .

మరి వాళ్లకు ? అన్నాడు

అప్పుడు వాడి కళ్ళల్లో మెరిసిన మెరుపు ఎన్ని " తారా జువ్వలు" వెలిగించినా రాదేమో ,

వాడి మోము పై విరిసిన కాంతి ఎన్ని కార్తీక దీపాలు వెలిగించినా రాదేమో




రాజారావ్ ఈ సారి కూడా నిరుత్సాహ పడ్డాడు. ఒకటా రెండేళ్లా పది సంవత్సరాల నుండి ఇదే తంతు. ఒక్కోసారి అనిపిస్తూ వుంటుంది అతనికి తను నిర్వహించాల్సిన క్రతువు సరిగ్గా చెయ్య లేదేమో నని. లేక పోతే తన మీద చివరి క్షణాల్లో సరిగ్గా చూసుకో లేదని తన తల్లికి కోపంగా వుండి ఆమె ఆత్మ అసంతృప్తితో ఉందేమో. ఇంతకీ రాజారావు పడుతున్న వేదన గురించి వ్రాయలేదు కదూ.

అతను తన తల్లికి ప్రతి సంవత్సరం పెడుతున్న ఆబ్దికాలకు పిండం ముట్టుకోవడానికి ఒక్క సారి కూడా కాకులు రాక పోవడం, అతనికి అసంతృప్తితో పాటు అవమానంగా కూడా అనిపించ సాగింది. అప్పటికీ ఏ ఏటి కా యేడు ఏ లోపం లేకుండా తన అన్నదమ్ములను, అక్క చెల్లెళ్ళను పిలుస్తూనే ఉన్నాడు. బ్రాహ్మణులకు వాళ్ళు అడిగినంత దక్షిణ ముట్ట చెపుతున్నాడు. వేసవి కాలంలో తన తల్లికి ఇష్టమని మామిడి పళ్ళను తెచ్చి భోక్తలకు భోజనంలో వేయిస్తున్నాడు. కనీసం ఎంత లేదన్నా ఆ క్రతువుకు పది వేలకు తక్కువ కాకుండా అవులోంది. ఇంత చేసినా కూడా పిండం ముట్టుకోవడానికి ఒక్క కాకి కూడా రావడం లేదు.

అప్పటికీ ఒక్కో సంవత్సరం ఆ పిండాన్ని ఒక్కొక్క సోదరుడి చేత కాకికి పెట్టిస్తున్నాడు. అయినా ఒక్క కాకి జాడ లేదు. తల్లికి తన

మీద కోపం వుండి ఉంటే వాళ్ళ కోసమైనా రావాలిగా?. చాలా ఇళ్ళల్లో ఆబ్దికాలు సామాన్యంగా పెద్ద కొడుకు ఇంట్లో పెడుతూ ఉంటారు. వాళ్ళు ఈ తంతునంతా భరించ గలిగితే పర్వా లేదు. కొంత మంది ఆర్థిక ఇబ్బందులు ఉండటం వల్ల సోదరులు ఇద్దరు ముగ్గురు ఉంటే వాళ్ళందరి దగ్గర డబ్బు వసూలు చేసి ఆ క్రతువును ఏ మాత్రం ఆక్షేపణ లేకుండా కానిచ్చేస్తారు.

ఒక సంవత్సరం అనుకోకుండా అన్న గారు ఒంట్లో బాగుండక పెట్టక పోతే ఆ బాధ్యత ఇంకొక సోదరుడు తీసుకోవాల్సి వచ్చింది. అతను ఎలాగు నెత్తి మీద వేసుకున్నాం కనుక దాన్ని " గెట్ టుగెదర్ కం ఆబ్దికంగా" మార్చేసి దగ్గరి బంధువులను కూడా పిలిచాడు. దాంతో అతని ఖర్చు తడిసి మోపెడంత అయ్యింది. అతని మీద జాలిపడి వచ్చిన సోదరులంతా సమానంగా వేసుకోవాల్సి వచ్చింది. అప్పుడే ఎవరో సరదాగా అన్నారు. ". సెర్మని అంటే "షేర్ మనీ " అని. .అతనా విమర్శ ఏమాత్రం పట్టించుకోక ఆ రెండు రోజులు అందర్నీ కలిపి ఆనందంలో ముంచాడు. అయితే డబ్బు విచ్చల విడిగా ఖర్చై పోయిందని, అనవసర పటోటాపం ఎక్కువయ్యిందన్న విమర్శ మాత్రం వచ్చింది.

ఇలాంటి అపవాదులు నెత్తి మీద వేసుకోవాల్సి వస్తుందని రాజా రావు ఎవ్వరికీ అవకాశం ఇవ్వక మొత్తం ఖర్చంతా తన నెత్తి మీదే వేసుకునే వాడు. ఇంత చేస్తున్నా ఒక సంవత్సరం కాక పోతే మరో సంవత్సరం అయినా పిండం ముట్టుకోవడానికి "కాకి" రాక పోవడం అతనికి జీవన మరణ సమస్య కింద తయారై కూర్చుంది.

ఈ విషయం గురించి మీరు పెద్దగా ఆలోచించకండి. కాకుల కోసం చూడటం వరకే మన పని." అంటూ రాజా రావు ఇంటికొచ్చిన ఒక బ్రాహ్మణుడు ధైర్యం చెప్పాడు.

సిటీలో కాకుల సమస్య ఎక్కువ గానే ఉంది. గృహ ప్రవేశాలకు, కర్మలలో గోదానాలు పేరు మీదట గోవులు అద్దెకు తీసుకుని క్రతువులు కానీయడం లేదా ? అలాగే కాకులను కూడా అద్దెకు తెచ్చుకోవాలో ఏమో ఖర్మ ?" అన్నాడు ఒక భోక్త నవ్వుతూ.

సిటీలో ఉండే కాకుల సమస్య ఒక్క రాజా రావుకే కాదని కొన్ని వేల మంది ఇదే సమస్య ఎదుర్కుంటున్నారని ఒక రోజు పేపర్లో చదివాడు రాజారావు ." ఈ రోజుల్లో గృహ ప్రవేశాలకు, జీవులు గతించినప్పుడు చాలా మంది గోదానం చెయ్యడం జరుగుతున్నదే. కాని ఎక్కడో ఒక్కరో ఆరో తప్ప నిజంగా గోవును కొని దానం చేసిన వారంటూ ఎవరూ కనపడరు. ముఖ్యంగా శ్రాద్ధ కర్మలలో పిండం పెట్టడానికి కాకులకు ఉన్న ప్రాశస్త్యాన్ని పురస్కరించుకుని ఆయా కర్మలను శ్రద్ధగా నిర్వహించడంలో కాకికి పిండం పెట్టడంతో మాత్రమే ఆ క్రతువుల లక్ష్యం నెర వేర గలదని.

ఆత్మలను సంతృప్తి పరచడంలో ఎటువంటి అశ్రద్ధ తగదని ఇటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇది సహేతుకమా కాదా అన్న విషయాన్ని పక్కన పెట్టి అటువంటి క్రతువులకు కాకులను సమకూర్చడానికి హైదరాబాద్ లోని రాధేయపురంలో వీరభద్రయ్య అనే వ్యక్తిని సంప్రదించవలసిందిగా అతని ఫోన్ నెంబర్ ఇస్తూ వచ్చిన ప్రకటన రాజారావును విశేషంగా ఆకర్షించింది.

" కాకులను పెంచుకుంటే తప్పేమిటి ? వన్య ప్రాణుల సంరక్షణ వారు దీనికి అభ్యంతరం పెట్టాలనుకుంటే చిలకలు పెంచే వారిని, పావురాయలు పెంచే వారిని కూడా ఇబ్బంది పెట్టాలి గదా?" ఇదే విషయాన్ని ఆబ్దికం ఇంకో వారం రోజులుందనగా అన్నదమ్ములంతా చర్చించు కున్నారు.

రాజా రావు పేపర్లో పడిన ప్రకటన చూసి అడ్రస్ వెతుక్కుంటూ వీరభద్రం ఇంటికి వెళ్ళాడు. అప్పటికే అక్కడ పది పదిహేను మందికి పైగా ఒక సిమెంట్ బల్ల మీద కూర్చుని ఉన్నారు. వారందరి వంతు అయి పోయాక రాజారావు వంతు వచ్చింది.

"రేపు పదమూడో తారీకు అమావాస్య నాడు మా అమ్మ గారి ఆబ్దికం. ఆ రోజు తమరు ఒక "కాకిని" మా ఇంటికి ఎటువంటి పరిస్థితితుల లోనూ మిస్ కాకుండా సమ కూర్చాలి." అంటూ తన అడ్రస్ కాయితం మీద వ్రాసి ఇచ్చాడు రాజారావు.

" అవుననుకోండి. చూస్తున్నారుగా. జనం ఎలా కూర్చున్నారో ? వీళ్ళల్లో ఎంత మందికి కాకులు సప్లయ్ చెయ్యగలమో మేము హామీ ఇవ్వలేక పోతున్నాం. మీరు చెప్పిన తేదీకి ఉన్న డిమాండ్ ను బట్టి పంపడం అనేది ఆధార పడుతుంది. ట్రై చేస్తాను. ఏదీ అడ్వాన్స్ ఒక వెయ్యి రూపాయలు ఇవ్వండి " అంటూ రసీదు పుస్తకం ముందు ఉంచాడు వీరభద్రం. . . .

అదృష్టం బాగుండి వీరభద్రం ఉదయం పదిన్నరకల్లా ఒక పంజరం లాంటి పెట్టెలో ఒక వ్యక్తిని రాజారావు ఇంటికి పంపించాడు అప్పటికే రాజారావు ఇంట్లో అతని సోదరులు, ఇతర దగ్గర బంధువులు చేరి ఇంకా బ్రాహ్మణులు రావడానికి సమయం ఉండటంతో పిచ్చా పాటి మాట్లాడుకుంటున్నారు. కాకితో వచ్చిన వ్యక్తిని చూడగానే వారందరి మొహం చేటంతయ్యింది .

క్రతువు పూర్తయ్యాక కాకికి పిండం వేసే వేళయ్యింది. అందరూ కలిసి బయటకు వచ్చారు. అప్పటి వరకు

కాకిని తెచ్చిన వ్యక్తి అక్కడే నిలబడి ఆపసోపాలు పడుతున్నాడు.

అంతలో ఎవరూ ఊహించని విచిత్ర సంఘటన జరిగింది. ఎక్కడి నుండి వచ్చాయో కాని కొన్నేళ్ళుగా సిటీలో వాటి అలజడే లేని ఒక పది పదిహేను కాకుల మూక చెవులు చిల్లులు పడేటట్టుగా అరుచుకుంటూ అక్కడున్న వారందరినీ పొడిచినంత పని చేసాయి. దానితో పంజరంలో కాకిని అద్దెకు తెచ్చిన వ్యక్తి బేజారై పోయి తన కాకిని బలవంతంగా పంజరంలోకి తోసేసి బయటకు పరుగు తీసాడు... పోనీ మూకుమ్మడిగా వచ్చిన కాకులైనా పిండం ముట్టుకున్నాయా అంటే అదీ లేదు....వచ్చినంత వేగంగా అవీ హుష్ కాకి...ఈసారైనా అబ్దికం సంపూర్ణమవుతుందనుకున్న ఆశలు అడియాసలైపోగా అన్యమనస్కంగా భోజనం చేసి నడుం వాల్చాడు రాజారావు...కలత నిద్ర పడుతూండగా ఏదో పొడిచినట్టయి ఉలిక్కిపడి నిద్ర లేచి పక్కకు చూసేసరికి ఇందాకటి కాకుల్లో ఒకటి పక్కనే వాలి తననే చూస్తోంది...చేత్తో అదిలించబోయిన రాజారావుకి అది ఏమాత్రం బెదరకపోగా స్థిరంగా అక్కడే ఉండడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించింది....ఏమయ్య రాజారావూ, అబ్దికం అన్య మనస్కంగా పూర్తి కానిచ్చినట్టున్నావే? అని వినిపించడంతో ఆ గొంతెవరిదో అర్థం కాక దిక్కులు చూడసాగాడు రాజారావు...

"నేనేనయ్యా...నీ మనస్తాపానికి కారణభూతాన్ని... అదేనయ్యా కాకిని..." సందేహం లేదు తనపక్కన వాలిన కాకే...మాట్లాడుతోంది...

నీ మనస్తాపానికి సారీ మీ మనుషుల మనస్తాపానికి కారణం మీరేనయ్యా...ప్రతిరోజూ కాకి కనిపిస్తే దాని అరుపు వినపడనంత దూరం చేతికందిన వస్తువు తీసుకుని విస్రి తరుముతారా, అదే మీ స్వార్థం కోసం, మీ పెద్దల ఆత్మ మాలో ఉంటుందన్న ఒకేఒక్క కారణంతో సంవత్సరానికొకసారి మీరు పెట్టే పిండం కోసం మాకోసం ఎదురు చూస్తారా? అంటే, ప్రకృతులోని ప్రతి ప్రాణీ, ప్రతి వస్తువూ మీ అవసరాలకనుగుణంగానే మనుగడ సాగించాలా?" స్థిరంగా పలికింది కాకి గొంతు...

" శాస్త్రం అలా చెబుతోంది...మాదేం తప్పు" అప్రయత్నంగానే అన్నాడు రాజారావు..

సరే, సంవత్సరానికొకసారి మీకు ఉపయోగపడాలంటే మేము బ్రతికుండాలికదా, ఉండాలంటే, ఎక్కడుండాలి? ప్రకృతిలో ఎన్నో పక్షులు, జంతువులూ నశించి పోతున్నాయి...వాటిలో మేమూ ఉన్నామన్న స్పృహ మీకుందా? ఎందుకు? కేవలం మీ స్వార్థం వల్లనే...మేం వాలడానికి ఒక్క చెట్టైనా ఉంచుతున్నారా? ఈ ప్లాటు మీరు కొనుక్కునే ముందు ఇక్కడెన్ని చెట్లుండేవో తెలుసా?

" నన్నేం చేయమంటావు? అవన్నీ నరికేసి వెంచర్ వేస్తేనే కదా మేం స్థలాలు కొని ఇల్లు కట్టుకున్నాం" రాజారావు సమర్థన ఉక్రోషం

కలగలిపి వెళ్ళగక్కాడు...

" అది నిజమే అనుకుందాం..మరి మీరు ఇల్లుకట్టుకోగా మిగిలిన స్థలంలో ఒక్క చెట్టైనా నాటారా? ఒక్క అంగుళం కూడా వదలకుండా మొత్తం ఇల్లు కట్టేసుకున్నారు...జాగా మొత్తం సద్వినియోగమైతే, అద్దెలొస్తాయి..చెట్లు నాటితే ఏమొస్తుంది? అంతేగా?? స్టయిల్ గా ఏ రెండో మూడో క్రోటన్ మొక్కలు నాటితే చాలు ఇంటి ముందు అందంగా ఉంటాయి..." రాజారావు కాదనలేకపోయాడు....

కాకి ఇంకా కొనసాగించింది..."సరే, ఇప్పటి విషయానికొద్దాము, వెయ్యి రూపాయలిచ్చి కాకిని తెప్పించుకుంటే, మీరిలా మూకుమ్మడిగా వచ్చి ఎందుకు అడ్డుకున్నారనేగా?"

అవునన్నట్టుగా తల ఊపాడు రాజారావు...

" ఎందుకంటే, వరుసగా కొన్నేళ్ళు కాకులు కనబడకపోతే, కారణం అన్వేషిస్తారు, పరిష్కారం కోసం ప్రయత్నిస్తారు, డబ్బు పారేస్తే కాకి దొరికితే, ఇక తెల్లారి మాగురించి ఆలోచించడానికి మీకు టైమెక్కడుంటుంది? ఇదేదో బాగుందని అసలే అంతరించిపోతున్న మావాళ్ళని బంధించి సంపాదనకెత్తుకునేందుకు అనేకమంది తయారవుతారు... ఉదాహరణకు వరదలొచ్చినప్పుడు కనిపించే నాలాల ఆక్రమణ సమస్య, వానాకాలంతోబాటు కొట్టుకుపోతుంది...మళ్ళీ షరా మామూలే కదా...బస్సు దొరికేవరకూ తిట్టుకున్న మనుషులే బస్సు దొరకగానే ఎగబడి సీట్లు సంపాదించుకున్నాక, అంతా మర్చిపోరా ఇదీ అలాగే..... కాకుల కోసం మాత్రమే కాక మీ రాబోయే తరాల కోసమైనా మీ పెద్దల స్మారకార్థం ఒక్క చెట్టు నాటండి....చెట్లు లేక కాకులే కాక అనేక అనేక పక్షి జాతులు అంతరించిపోతున్నాయి...వాటి కోసమైనా చెట్లు పెంచండి...అవన్నీ బ్రతికితే మాకేంటి లాభం అనుకుంటున్నావా? ఏం, మనుషులకుపయోగపడితేనే మేం బ్రతకాలా? భగవంతుడు మీలాగే మాకూ బ్రతికే హక్కు ఇచ్చాడు... వనరులను హరిస్తూ మా హక్కును మీ మానవ జాతే కాలరాస్తోంది...దయచేసి మమ్మల్ని బ్రతకనివ్వండి" కాకి ఏడుస్తోంది....ధారాపాతంగా కన్నీరు కారుస్తోంది.....

రాజారావుకి మెలకువొచ్చింది...కాకి మాట్లాడింది కలలోనే కదాని తేలిగ్గా తీసుకోలేకపోయాడు...మనుషులకు ఆత్మఘోష ఉన్నట్టే కాకులకూ ఉంటుందన్న విషయం అర్థమైంది....అదే తనకు కలలో కనిపించింది...తన ఘోష వినిపించింది....

తన కర్తవ్యమేదో బోధించింది....ఎవరి మనోభావాలనైనా వ్యక్తప్రచడానికి ఇప్పుడు ఎక్కువగా కష్ట పడక్కరలేదు...పెద్దపెద్ద వేదికలే అవసరం లేదు....సోషల్ మీడియా చాలు...ఏదోక న్యూస్ చానల్ వాళ్ళను పట్టుకోగలిగితే చాలు...సంప్రదాయాల్ని గౌరవించే

ప్రతిఒక్కరూ, శాస్త్రాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ఆచారాల్ని పాటించే ప్రతి ఒక్కరూ తమ పెద్దల సంస్మరణ రోజుని పర్యావరణ పరిరక్షణ దినంగా, జీవ సమ్రక్షణ దినంగా ప్రకటించుకోవాలి ఆ విషయాన్ని పదిమందికీ తెలియజెయ్యాలి....ఆ దిశగా చైతన్యం తీసుకురావాలి....ఆ ఆలోచనే రాజారావుకి తృప్తిగా అనిపించింది......




సంవత్సరం లో జరిగే నాలుగయిదు బోర్డు మీటింగుల్లో షేర్ హోల్డర్ల జనరల్ బాడీ మీటింగ్ ముందు జరిగే బోర్డు మీటింగ్ చాలా ముఖ్యమైంది. అందులోనే డైరెక్టర్ల రిపోర్ట్ మొదలయిన ముఖ్య విషయాలు ఫైనలైస్ చేస్తారు. దానికి సంబంధించిన అజెండా వివరాలు ఆఫీసులో ఉండగా పూర్తి అవలేదు. వాటిని పూర్తి చేద్దామని ఇంటికి రాగానే కళ్యాణి ఇచ్చిన కాఫీ తాగి కంప్యూటర్ ముందు కూర్చున్నా. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ల్యాండ్ లైన్ కి యేమ న్నా వస్తే, మా ఎండీ దగ్గరనించి తప్ప, మిగతావి ఏవీ ఇవ్వవద్దని చెప్పాను కళ్యాణి కి.

నేను అన్నీ పూర్తి చేసి క్లియరెన్స్ కోసం మా ఎండి కి మెయిల్ పెట్టి లేచాను. ఈ లోపులో రెండు మూడు కాల్స్ వచ్చాయి. ఒకటి ఎక్కువ సేపు మాట్లాడినది, బహుశా మా పెద్ద వదిన నుంచి అయి ఉండవచ్చు అనుకున్నాను.

సిస్టం ముందు నుంచి లేచి వస్తూ " ఏమిటి విశేషాలు? " అన్నాను? తను ఎలాగా చెబుతుందని తెలిసి కూడా

"మీ పెద్ద వదిన గారు. రాంబాబు విషయం చెబుతున్నారు"

. రాంబాబు మా పెద్దన్నయ్య రెండో కొడుకు. కల్యాణి ఏదయినా చెబితే , చెప్పిన పద్ధతి బట్టి చాలా గ్రహించ వచ్చు.. ప్రస్తుతం సూచన ఏమిటంటే ఏదో పెద్ద విశేషమే ఉండి ఉండాలి.

" ఏమిటి రాంబాబు గురించి? " జాబ్ ఏమన్నా మారుతున్నాడా? " అన్నాను అంతకన్న ఇంకేమిటి ఉంటుందని.

మా పెద్దన్నయ్యకి నాకూ పదిహేను ఏళ్లు తేడా ఉంది. మధ్యలో ముగ్గురు అన్నయ్యలూ, ఇద్దరు అక్కలూ, ఆ తరువాత నేను. మా నాన్నగారు నరసాపురం దగ్గర కొప్పర్రు లో ఎలిమెంటరీ స్కూల్ టీచర్ గా చేసేవారు. ఉండడానికి నలభయి ఎకరాలు ఉన్నా, రాబడి అంతంత మాత్రంగా ఉండడంతో అంత పెద్ద సంసారాన్ని కష్టం గా ల్లాక్కొ చ్చారు.పెద్దన్నయ్య చిన్న వయసులోనే బిఈడి చేసి నరసాపురం లో టైలర్ హైస్కూల్లో టీచర్ గా చేరాడు. ఇద్దరు అక్కల పెళ్ళిళ్ళూ నాన్నగారు ఇదయింతరువాత పెద్దన్నయ్య ఆధ్వర్యం లోనే జరిగాయి. మా ఊళ్ళో హైస్కూల్ లేదు కాబట్టి మా చదువులన్నీ పెద్దన్నయ్య దగ్గరే జరిగాయి

" రాంబాబు వేరే కులం అమ్మాయిని పెళ్లి చేసుకుంటానంటున్నాడట" అంది విషయం బయట పెట్టి వంటింటి వైపు వెడుతూ

నేను చివాలున సోఫా నుంచి లేచి కల్యాణి వెనకే వెళ్లి " ఏమిటి వేరే కులం అమ్మయినా ? పెద్ద అన్నయ్య ఒప్పుకున్నాడా? "

" మొదటగా మీ వదినతోనే చెప్పాడట. ఇంకా మీ అన్నయ్య దాకా వెళ్ళ లేదు. ఈ విషయంగా తండ్రీ కొడుకుల మధ్య గొడవ అవుతుందేమో నని మీ వదిన కి భయంగా ఉందట"

ఇంకా పెద్దన్నయ్య దాకా వెళ్ళని విషయం కళ్యాణి తో పెద్ద వదిన చెప్పిందంటే, దానికి కారణం లేకపోలేదు. అందరి తోడికోడళ్ళలోనూ పెద్ద వదిన సఖ్యత గానే ఉంటుంది కానీ, కల్యాణి తో ఎక్కువగా ఉండడానికి కారణం, కళ్యాణి వాళ్ళ చిన్నాన్నగారి కూతురు కావడమే.

రాంబాబు ప్రేమలో పడడం అందులో వేరే కులం అమ్మాయితో !. పెద్దన్నయ్య ఎలా దీనికి స్పందిస్తాడో ! ఈ సమాచారంతో నాలో పెద్ద కుతూహలమే రేగింది . అందుకు కారణం లేకపోలేదు.

నేను గతంలో ఎదుర్కొన్న పరిస్థితే ఇప్పుడు రాంబాబు ఎదుర్కుంటున్నాడన్న మాట. కళ్యాణి ఇచ్చిన సమాచారం నాలో పెద్ద ప్రశ్న లేపడమే కాకుండా నన్ను గత జ్ఞాపకాలలో పడేసింది.

*****

ఇది జరిగి పన్నెండు ఏళ్ళు అయినా నా మనసులో ఇంకా అప్పుడప్పుడు మెదులుతూనే ఉంటుంది. నేను సిఏ పూర్తి చేసిన వెంటనే ఓ కంపెనీ లో ఫైనాన్స్ మేనేజర్ గా చేరాను . చేరిన ఆరునెలలకే ఆ కంపెనీ పబ్లిక్ ఇష్యూ తలపెట్టింది. దానితో చాలామాట్లు ముంబయికి ఫ్లయిట్ లో వెళ్ళ వలసి వచ్చేది. ఒక మాటు నా పక్క సీట్లో ఒక అమ్మాయి ప్రయాణం చేసింది. పేరు రజని. చాలా కలుపుగోలు మనిషి అవడంతో, కొద్ది సమయంలోనే పరిచయం అయి సంభాషణలో పడ్డాము. రజని ఓ పెద్ద కంపెనీ లో కంపెనీ సెక్రెటరీ గా హైదరాబాద్ లోనే పనిచేస్తోంది. మాటల సందర్భంలో, నేను ముందు ప్లాన్ చేసుకోక పోవడం వల్ల, హోటల్ బుక్ చేసుకోలేదని తెలిసి, వాళ్ళ కంపెనీ గెస్ట్ హౌస్ లో ఉండవచ్చని ఆహ్వానించింది. ఆ పరిచయం హైదరాబాద్ తిరిగి వచ్చినతరువాత బాగా పెరిగింది. చాలా మాట్లు కలవడం, సినిమాలకి వెళ్లడం జరిగేది. వాళ్ళ వాళ్లు అందరూ బాగా చదువుకున్న వాళ్ళు. ఇద్దరు అన్నయ్యలు వేరే రాష్ట్రాల్లో ఐఏయస్ ఆఫసర్లు గా చేస్తున్నారు. వదినలు కూడా ఐఏయస్ ఆఫీసర్లే. ఆమె ప్రోత్సాహంతోటే ఏసిస్ కోర్సు ప్రారంభించా.

ఒక ఏడాది లో చాలా దగ్గర అయ్యాము. నాకు రజని వ్యక్తిత్వంలో చాలా విషయాలు నచ్చాయి. ఆమె ఏ విషయాన్నయినా ఎక్కువగా మనసుకు పట్టించుకుని ఎక్కువసేపు ఆలోచిస్తూ కూచోదు. జరగవలిసింది జరుగుతుంది మనం బుర్ర పాడు చేసుకోవడం కంటే, చేయవలిసింది చేసుకుంటూ పోవడం ఉత్తమం అన్న తత్వం ఆచరణ లో పెడుతుంది. ఆర్థికంగా మంచి స్థితి లో ఉన్నా వీలయినంత గా అవసరం లో ఉన్న వాళ్లకి సహాయపడుతూ ఉండే ఆమె తత్వం నాకు బాగా నచ్చింది . ఇలాటి వన్నీ కలిసి ఎప్పుడో నాకు తెలియకుండానే నాలో ఒక ఆలోచన చోటు చేసుకుంది. ఇద్దరం ఎందుకు పెళ్లి చేసుకో కూడదని. ఒక ఏడాది గడిచే వరకూ ఆ ఆలోచన రాక పోవడానికి కారణం లేక పోలేదు. కులాల వ్యత్యాసం. వాళ్లంతా పక్కా మాంసాహారులు. మేము గుడ్డు కూడా తినని శాఖాహారులం. అయినా నాకు ఎందుకో ముందుకు వెళ్లాలని అని పించింది. కానీ పెద్దన్నయ్య తో సంప్రదించకుండా ముందుగానే రజని తో కదపడం నాకిష్టం లేక పోయింది. తన వైపు నుంచి అభ్యంతరం ఉండదని నాకు తెలుసు. నాలో ఏమి చూసి ఒప్పుకుంటుందని అని అడిగితే, ఏమీ చెప్పలేను. బయటికి చెప్పని బహుశా నా కళ్ళలో కనపడే ఆరాధనా భావం అనుకోవచ్చేమో.

మూడు రోజులు సెలవలు వస్తే, పెద్దన్నయ్య దగ్గరికి వెళ్లి వద్దా మినిపించి    బయలు దేరా. "గోదావరి వైపు ఊళ్లు ఎప్పుడూ చూడలేదు నేను కూడా వస్తానని బయలుదేరింది రజని కూడా"

మా పెద్దన్నయ్య ఇల్లు పెద్దదే కానీ పాత కాలం ఇల్లు. బాత్ రూములూ అవీ అంత బాగుండవు. నరసాపురం లోనే నా చిన్నప్పటి క్లాస్మేట్ రామం రొయ్యలు వ్యాపారం చేస్తూ అక్కడే ఉండిపోయాడు, వాడు అధునాతనం గా పెద్ద ఇల్లుకట్టుకున్నాడు నరసాపురం లోనే.    నాన్న గారు, అమ్మ తరువాత కొప్పర్రు లో ఎవరూ ఉండడం లేదు. అక్కడ ఇల్లుని అన్నయ్యలు వ్యవసాయం పనులకి వాడుతూ అప్పుడప్పుడు వెళ్లి వస్తూ ఉంటారు. రామం తో చెప్పి    చెప్పి రజనీని అక్కడ దింపి నేను అన్నయ్య ఇంటికి వెళ్లాను. వదిన తో చెప్పాను రజని వచ్చిన సంగతి. ఇంటికే తీసుకు రాక పోయావా ? అంది

ఉండడానికి రామం ఇంట్లో అయినా, రజని చాలా సేపు అన్నయ్య ఇంట్లోనే అందరితో ఎక్కువ సమయం ఉండి అందరితోనూ కలిసి పోయింది. అన్నయ్య కూతురు బాల తోటీ కొడుకులు రాజా , రాంబాబు ల తోటీ బాగా కలిసి పోయింది గోదావరి పరిసర ప్రాంతాలు, కొబ్బరి చెట్లు, పచ్చని తివాసీ లాంటి    వరి పొలాలూ    అవీ చాలా బాగా నచ్చాయి రజనికి. పోతే హైరాబాద్ కంటే హ్యూమిడిటీ ఎక్కువ కాబట్టి ఫ్యాన్ గానీ, ఏసీ గానీ లేకుండా ఇళ్లల్లో కష్టమని గ్రహించడానికి అట్టే సేపు పట్టలేదు    పెద్దన్నయ్య తప్ప అందరం కలిసి    అంతర్వేది అవీ చూసి వచ్చాము . .

ఆ మరునాడు ప్రొద్దుట రాజా రజనీని గోదావరి మీద పడవ షికారు కి తీసుకు వెళ్ళాడు.

నేను పెద్దన్నయ్యతో మాట్లాడుతూ ఉండిపోయాను. మిగతా వాళ్లు పట్ట లేదు కానీ పెద్ద    వదిన పసి కట్టేసింది. పెద్దన్నయ్యతో ఉండగానే వదిన వచ్చి " ఏమయ్యా రజని, స్నేహితురాలేనా ? ఇంకా ఆలోచన ఏమన్నా ఉందా ? అంది నవ్వుతూ

నాన్న గారి తరువాత పెద్దన్నయ్యే అన్ని విషయాలు చూస్తునందువల్ల అన్ని ముఖ్య విషయాల లోనూ అందరం పెద్దన్నయ్యతో సంప్రదించి చేయడం అలవాటు. మా కుటుంబం లోనే    కాకుండా, అతని పాత విద్యార్థులు, ఊళ్లో చాలామంది తెలిసిన వాళ్ళు పెద్దన్నయ్య సలహా చాలా విషయాలలో తీసుకోవడం కద్దు. అదీ కాకుండా చేస్తున్నది స్కూల్ లో టీచర్ ఉద్యోగమయినా పెద్దన్నయ్య ప్రాపంచిక విషయాల యితే నేమి, ఆధ్యాత్మిక విషయాలయితే నేమి చాలా చదివాడు. అవి ఇచ్చిన సమరస్త్వము దృష్ట్యా చాలా మంది ఆయన అభిప్రాయానికి విలువ ఇవ్వ డం చూస్తూనే ఉన్నాము.

పెద్దన్నయ్యతో ఎలా కదపాలా అని నేను సందేహిస్తోంటే వదిన అలా అడగడం అవకాశం గా తీసుకుని నేను పెద్దన్నయ్యతో అన్నాను

" రజనిని చూశావు కదా?" అన్నాను అభిప్రాయం అడుగుతున్నట్టు

"చాలా చలాకీ గా ఉంది అమ్మాయి. బాగానే ఉంది. చెప్పిన విషయాలు బట్టి వాళ్ళు మన వాళ్ళు కాదేమో" అన్నాడు ఆమె కేస్ట్ దృష్ట్యా.

" అవును మన కేస్ట్ కాదు. అది పెద్ద ముఖ్య విష్యం కాదేమో" అన్నాను డిఫెన్సివ్ గా

" నేను చిన్నప్పటి నుంచి నిన్ను చూస్తున్నాను కదా!, నా నిర్ణయం చెప్పమంటే, నువ్వు ముందుకు వెళ్లడం మంచిది కాదేమో. అలా అయితేనే నువ్వు భవిష్యత్తులో ఆనందంగా ఉంటావేమో! " ఒక్క 'కేస్ట్' విషయం దృష్ట్యా ఈ నిర్ణయం చెప్పటం లేదు, అది ముఖ్య విషయం కాదన్నావు. ముఖ్య విషయం అవునా కాదా అన్నది ఒక సాధారణ విషయం గా కాకుండా అందరు వ్యక్తుల కీ ఒకే విధంగా కాకుండా, వ్యక్తి వ్యక్తి కీ అతని మనస్తత్వం దృష్ట్యా చూడక పోతే సరయిన నిర్ణయానికి రాలేమేమో "

"అంటే ?" అన్నాను పూర్తిగా అర్థం కాక పోయినా , కొంత చూచాయగా నా మనస్తత్వానికి ముడి పెడుతున్నాడని గ్రహించి

" మనం ముఖ్య నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు ప్రస్తుత ఎమోషన్ దృష్ట్యానే కాకుండా కొంచెం ముందు జరగ బోయే విషయాలు కూడా ఊ హించుకుని మన వ్యక్తిత్వం దృష్ట్యా విశ్లేషించు కోవడం మంచిదేమో. కొంచెం వివరాల లోకి వెడదాము. కేస్ట్ వినగానే మాంసాహారులని పించినా, ఈ రోజుల్లో చాలామంది స్వచ్ఛందం గా శాఖాహారం పాటిస్తున్నారు. దాని దృష్ట్యా ఆ అమ్మాయి నాన్ వెజ్ తీసుకుంటుందా లేదా అన్నది నాకు తెలియదు "

" తను నాన్ వెజ్ తీసుకుంటుంది"

" ఓకే. నా అభిప్రాయం ఏదయినా, నిర్ణయం తీసుకోవాలిసింది నువ్వే. అయితే నేను చెప్పబోయే రెండు విషయాలు నువ్వు దృష్టి లో ఉంచుకుని, బాగా అలోచించి నిర్ణయం తీసుకో. రెండిటి లో మొదటిది ఆహార విషయాలు. చిన్నప్పుడు చిన్నన్నయ్యని ఓ వారం రోజులు గుడ్డుని పాలల్లో తీసుకోమని డాక్టర్ చెబితే వాడు ఓ గ్లాసు వాడాడు. అమ్మ దానిని వేరే ఒక చోట పెట్టించినా. నువ్వు ఒక రోజు పొరపాటున దానిని వాడి, గ్లాసు బాగా కడిగినా, అందులో వచ్చిన వాసన కి వాంతి చేసుకుని అందరినీ తిట్టి పోశావు. ఆ వేళ మన ఇంట్లో ఉన్న నా క్లాస్ మేట్ నారాయణ వేళాకోళం గా " వీడి పెళ్ళాం గుడ్డు తింటే ఆమె దగ్గరికి

వేళ్ళడేమో" అని అంటే అందరం నవ్వుకున్నాము.

ఇక రెండోది కొంచెం రిమోట్ విషయం అనిపించినా ఇప్పుడు తప్పకుండా ఆలోచించ వలసిన విషయం. నీకూ పిల్లలు పుడతారు, వాళ్ళు పెద్దవాళ్లు అవుతారు. వాళ్ళకి పెళ్లిళ్లు చెయ్యాలి. ఇప్పుడు నువ్వు రజని ని పెళ్లిచేసుకోవడం వల్ల , నీపిల్లలకి నీ కేస్ట్ లో వాళ్ళకే ఇచ్చి చేయడం వీలు కాక పోవచ్చు. ఎందుకంటే తెలిసి నీ కేస్ట్ వాళ్ళు ముందుకు రారు. ఇప్పుడు అలా జరుగుతున్న కేసులు చూస్తున్నాము. అయితే నువ్వు రజని వాళ్ళ కేస్ట్ లో ఇవ్వడానికి సిద్ధ పడాలి. అప్పటికి కేస్ట్ పట్టింపులు సమసి పోతాయి అని భ్రమ లో ఉండకు. గతం లో కంటే ఇప్పుడు కేస్ట్, సబ్ కేస్ట్ వారీగా మేరేజ్ బ్యూరో లు పుట్టుకు రావడం చూస్తూనే ఉన్నాము, రాజకీయం గా కానీ, సాంఘికం గా కానీ అవి ఇప్పట్లో సమసి పోతాయని ఆసించకండా మనం సిద్ధపడడం తెలివయిన పని. అయితే సాంఘికం గా, ఆర్థికంగా చాలా ఉన్నత స్థాయి లో ఉన్న కుటుంబాలలో కేస్ట్ ప్రభావం ఎక్కువ ఉండక పోవచ్చు. అది సినిమా తారలు, క్రికెట్ తారలు విషయంలో చూ స్తూనే ఉన్నాము. కానీ మనలాంటి కుటుంబాలలో కొన్ని సమస్యలు తలా ఎత్త వచ్చేమో" అని ముగిస్తూ "నా అభిప్రాయం ముందే చెప్పాను కాబట్టి. ఆలోచించి నిర్ణయం నువ్వే తీసుకో " అన్నాడు

నేను అప్పటికి ఆ విషయం మళ్ళీ కదప లేదు

****

పెద్దన్నయ్య చెప్పినవి మనసులో మెదులుతూ హోమియో మందులా లోలోపలే పనిచేసి చివరికి రజని వద్ద ఆ విషయం ఎత్త కుండానే అణగి పోయింది. నిర్ణయం నాకే వదిలేశాడు కాబట్టి ఎప్పుడూ ఆయన్ని ఏమీ అనుకోక లెకపొయాను.

ఇన్నేళ్ల తరువాత ఇప్పుడు రాంబాబు వార్త తో మళ్ళీ గుర్తుకు వచ్చాయి. రాంబాబు పెదఅన్నయ్యతో ఆ విషయం చెబుతాడా? చెబితే ఆయన ఎలా రియాక్ట్ అవుతాడు అన్న ప్రశ్నలకి జవాబు కోసం ఎక్కువ రోజులు ఆగ నక్కర లేక పోయింది.

కల్యాణికి పెద్ద వదిన నుంచి వచ్చిన ఫోన్స్ ద్వారా తెలిసింది ఏమిటంటే మంజరి అనే వాడి కొలీగ్ తో మ్యారేజ్ ఫిక్స్ అయిందని.

ఆ తరువాత పెద్దన్నయ్యే ఫోన్ చేసి చెప్పాడు. పెళ్ళి హైద్రాబాద్ లోనే జరుగుతుందని. నేను చేయవలసిన పనులు కొన్ని

పురమాయించి కార్డు పంపాడు. అనుకున్నట్టే కార్డు బట్టి చూస్తే వధువు తాలూకు వాళ్ళు వేరే కేస్ట్ అన్నది స్పష్టం గానే ఉంది. పెద్దన్నయ్య మనస్ఫూర్తి గానే ఒప్పుకున్నాడా అన్న సందేహం నన్ను దొలుస్తూనే ఉంది

పెళ్ళికి మూడు రోజులముందు పెద్దన్నయ్య వాళ్ళు మా ఇంట్లోనే దిగారు. నా కుతూహలం అణచుకోలేక వాళ్ళు సెటిలయింతరువాత అన్నాను పెద్దన్నయ్యతో " అమ్మాయి వాళ్లు వేరే కేస్ట్ లా ఉందే " అన్నాను.

"నీ ప్రశ్న అర్థమయిందిరా. నీ విషయంలో అలా చెప్పి, రాంబాబు విషయంలో ఎలా ఒప్పుకున్నాన నే కదా? నీ సందేహం?

సరిగ్గా నీకు ఎలా చెప్పానో వాడికీ అలాగే చెప్పాను. నువ్వు ముందుకు వెళ్ళలేదు. వాడు ముందుకు వెళ్ళిపోతున్నాడు. అది వాడి నిర్ణయం. మనం చేయగలిగింది ఏముంది? " అన్నాడు పెద్దన్నయ్య నిర్లిప్తంగా

రాంబాబు కొచ్చిన్ లో పనిచేస్తున్నాడు. పెళ్ళికి ముందు ఆఫీస్ పనిమీద కెనడా వెళ్లినందున, పెళ్ళికి ఒక రోజు ముందే వచ్చాడు హైదరాబాద్. అందరూ పెళ్లి హడావిడి తో ఉండడంతో నేను వాడితో మాట్లాడడం కుదరలేదు.

కళ్యాణ మంటపానికి అందరూ కార్లలో బయలుదేరారు. నన్నూ రాంబాబుని ఒక కారు లో రమ్మన్నారు. దారిలో అడిగాను " ఎరా మరి

నాన్ వెజ్ తినడానికి ప్రిపేర్ అయిపోయావా? "అన్నాను నవ్వుతూ.

"బాబాయ్ ఒక రహస్యం చెబుతాను "నాన్ వెజ్ మానేస్తానని మంజరికి ప్రామిస్ చేశాను"

"అదేమిటి ? నువ్వు ప్రామిస్ చేయడమేమిటి? అన్నాను అర్థం కాక

ఐఐటీ హాస్టల్ లో ఫ్రెండ్స్ తో బాగా నాన్ వెజ్ అలవాటయింది బాబాయ్. మంజరీ వాళ్ళూ కేస్ట్ పరంగా నాన్ వెజ్ అయినా, వాళ్లంతా స్ట్రిక్ట్ వెజ్.

ఇంక నేను మాట్లాడ లేదు




చాలా కాలం క్రితం ఒక అడవికి రాజైన సిం హం ఒక గుహలో నివసిస్తుండేది. సమీపం లోని పొదల్లో ఉండే ఒక ముంగిస ఈ మృగరాజుని దూరంగా ఉండి గమనిస్తుండేది.

జూలుతో ఠీవిగా కనపడే ముఖం, రాజసం ఉట్టి పడే నడక, ఎండ, వాన, చలి బాధ లేకుండా హాయిగా గుహలో మృగరాజు హోదా లో బతకడం ఇవన్నీ గమనిస్తున్న ముంగిసకి కొన్నాళ్ళకి సింహం పై అసూయ కలిగింది.

ఎలాగైనా దాన్ని అంతమొందించి ఆ గుహలో తాను నివసించాలని కలలు కంది. ఆలోచించగా ఆలోచించగా దానికో ఉపాయం తట్టింది.

ఒక రోజు ఉదయాన్నే గుహ ముందు మోకరిల్లి దీనంగా అరవ సాగింది. ఆ దీనాలాపన విన్న సిం హం బయటకు రాగానే "ప్రభో!కాపాడండి. అక్కడొక జంతువు నన్ను భయ పెడుతోంది. దానికి నేను నమస్కరించ లేదని "సంస్కారం లేదా? అడవికి రాజునని తెలీదా?" అని తిట్టి పోసింది. మాకు రాజు నువ్వు కాదు. వేరే ఉన్నారు. అని నేనంటే చెంప పై కొట్టింది. "మీ రాజుని దమ్ముంటే వచ్చి నన్ను గెలవమను." అని చెప్పింది. మీరే వచ్చి దాని పొగరణచాలి."అంది. ఆ మాటలు విన్న సింహం

మండిపడుతూ ముంగిస వెనకాలే వెళ్ళింది.

దూరంగా కాలి బాట సమీపంలో ఉండే బావి దగ్గరకు తీసుకు వెళ్ళి తొంగి చూడమంది ముంగిస. నీటిలో కనబడే తన ప్రతి బింబాన్ని చూసి మరో సింహంగా పొరబడి కోపంతో గర్జించింది సింహం.

కాని ఇలా ఆలోచించింది. 'కుందేలు మాటలు విని మా ముత్తాత నూతిలో దూకాట్ట. నేను అలా చేయ కూడదు. నూతిలో సింహాన్నే బయటకు రానీ. అప్పటి వరకు వేచి ఉంటాను' అనుకుంది. నూతి గట్టునే తిష్ట వేసింది.

అప్పటినుండి ఆకలేస్తే త్వరగా దగ్గర్లో దొరికింది వేటాడి తినేయడం, నూతి గట్టున కునికి పాట్లు పడడం ఇదే సింహం దిన చర్యగా మారింది.

ఇక ముంగిస దర్జాగా సింహం గుహలోనే ఉండ సాగింది. ఇక్కడేమో సింహానికి కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర కరువైనాయి.

ఈలోగా కాలి బాట గుండా చుట్టు పక్కల పల్లెలకి రాక పోకలు సాగించే జనంలో కలకలం మొదలైంది. నూతి గట్టున సింహం తిరుగాడుతుండడం చూసి వారు భయంతో వణికిపోయారు. చుట్టు తిరిగి వెళ్ళసాగారు.

అప్పుడప్పుడు నీళ్ళు తోడుకునే జనం రాకపోవడంతో నూతిలో నీరు నాచు పట్టింది. ఒక రోజు తొంగిచూసిన సింహానికి ప్రతిబింబం కనపడలేదు.

"ఓహో! నా శత్రువు నాకు భయపడి నూతిలోంచి బయటకి రాక నూతిలోనే చచ్చింది. అందుకే నీళ్ళు పాడైపోయాయి." అనుకుంది సింహం. పరమానందంతో అడవి అదిరిపోయేలా గర్జించింది.

నూతి సమీపంలోని ఒక పుట్టలోని పాము చాలా రోజుల నుండి ఈ తతంగం గమనిస్తోంది. తమ రాజు అలా అమాయకంగా ముంగిస చేతిలో మోస పోవడంతో దానికి జాలేసింది.

యుక్తిగా మృగరాజుని మోసం చేసిన ముంగిస అంతు చూడాలనుకొంది...

సిం హం వద్దకెళ్ళి, అదేమిటి రాజా? మీ గుహ వదిలి బావి వద్ద ఉంటున్నారు, ఎవరకోసం ? అనడిగింది...

ఎవరో కొతరాజట, నన్నే సవాల్ చేసిందట, బయటికొస్తే దాని అంతు చూద్దామని కాచుక్కూర్చున్నాను? అంది సిం హం...

దానికి పాము, " అయ్యో రాజా మీరిక్కడ కాపు వేసి కూర్చున్నారు, ఆ జీవి దర్జాగా మీ గుహలోనే తిష్ట వేసింది...కావాలంటే వెళ్ళి చూడండి అని చెప్పింది....అసలే ఇన్నిరోజులూ ఎండకీ చలికీ బికచచ్చి కోపంతో ఉన్న స్మ్ హం ఒక్క ఉదుటన పరిగెత్తి తన గుహకు చేరుకునేసరికి దర్జాగా కూర్చుని ఉన్న ముంగిస కనిపించింది...ముంగిస చేసిన మోసం అర్థమై, దాని మీద పడి చంపేసింది సిం హం....

నీతి : అధికారులతో ఆడుకోరాదు...అది అసలుకే ప్రమాదం.




కైలాస గిరి కి      చాలా సంబంధాలు చూశాడు అతడి తండ్రి అహోబలరావు. జాతకాలు నప్పక ఓ పట్టాన ఏదీ కుదర లేదు. అతని జాతక రీత్యా ఆ సంవత్సరం కుదరక పోతే, ఇంకో నాలుగేళ్ళ దాకా పెళ్లి యోగం లేదన్నాడు జాతక రత్న మిడతం భొట్లు గారు. పైగా, “మనవడి పెళ్ళి చూస్తేనే గాని నా ప్రాణం పోదు. ఎనభై అయిదేళ్లొచ్చి ఇప్పుడిలా మంచాన పడిన నాకు      మీరు      చాకిరీ చేయ లేక, మాన లేక కిరికిరి పడతారు. నన్ను ఏ అనాథాశ్రమం లోనో చేర్పించే ప్రయత్నం చేస్తే, నా ఆస్తి మొత్తం నన్ను చివర్లో ఎవరు చూస్తారో వాళ్లకే చెందుతుందని ముందే వీలు వ్రాసేశాను కనుక, ఆ ఆస్తి ఏదో వాళ్లకే పోతుంది. అలా నా వీలు అమలు జరక్కుండా ఉండాలంటే, మీకు      వీలు లేకపోయినా నన్ను చచ్చేదాకా చూడాల్సిందే.” అని ఫిటింగ్ పెట్టిన తల్లికోసమైనా ఇంకా లేటు చెయ్యకుండా ఈఏడాది కొడుక్కి పెళ్ళిచేసేయాల్సిందే అన్న నిర్ణయానికొచ్చేశాడు అహోబలరావు.

దాంతో తీవ్ర పెళ్లి ప్రయత్నాలు యుద్ధ ప్రాతిపదికన చేసి, మొత్తానికి పర్వత వర్ధనితో పెళ్ళి ఖాయం చేశాడు అహోబల రావు.

అయితే, కైలాసగిరి ముందు ఒప్పుకోలేదు. "వద్దు నాన్నా ఆ అమ్మాయి నిజం గానే పర్వతం లాగుంది. ఇప్పుడే ఇలాగుంటే, పెళ్ళైయ్యాక ఇంకా వర్ధిల్లితే పర్వత వర్ధని పేరు సార్ధకం అవుతుంది. నాకొద్దన్నాడు." దానికి తండ్రి, "ఒరే, నువ్వు మాత్రం తక్కువున్నావా? కైలాస గిరి అన్న పేరుకి తగ్గట్టుగా లేవూ? ఇంక నీకు ఇంత కన్నా మంచి సంబంధం నేను తేలేను. ఒప్పేసుకో. పైగా ఈ యేడు నీకు పెళ్లి కాక పోతే, ఇంకో నాలుగేళ్ళ దాకా అవదన్నాడు శాస్త్రులు గారు. అప్పటికి పరిస్థితులు ఎలా మారి పోతాయో? ఈపాటి కట్న కానుకలు కూడా వస్తాయో రావో తెలీదు. పైగా నువ్వెంత అందగత్తెని చేసుకున్నా, ఆ పిల్ల కూడా పెళ్ళైయ్యాక లావవదని గారంటీ ఉందా? అదీ కాక ఈ పిల్ల ఇప్పుడే పెరగాల్సినంత పెరిగి, సాట్యురేషన్ పాయింట్ కొచ్చేసింది. ఇంక తగ్గడమే గానీ పెరగడం ఉండదు. పైగా ఆ పిల్ల తండ్రి పెళ్ళి నాటికి ఆ అమ్మాయి స్లిమ్ గా కన బడేలా ఏదో మూణ్ణెల్లో, ఆర్నెల్లో గేరంటీ ఇచ్చే ఒబేసిటీ సెంటర్ లో చేర్పించే ఏర్పాటు చేస్తానని మాటిచ్చాడు.

ఇది నీకు బోనస్ పాయింట్. నా మాటినుకోరా!" అని వాస్తవాలు చెప్పడంతో ప్రారంభించి, భవిష్యత్ భయాలు, ఆశలు వగైరా ఉటంకిస్తూ, చివరిగా "ఇప్పుడీ సంబంధం నువ్వొప్పుకోక పోతే, నీ నాయనమ్మ కోరిక తెలుసుగా?!... ఆవిడ నీ పెళ్లయే దాకా పోదు. ఇంకో నాలుగేళ్లు ఆవిడ్ని చూసే ఓపిక నాకు, మీ అమ్మకి లేదు. అయితే.. నీ పెళ్లవ గానే ఆవిడ బకెట్ తన్నేస్తుందనే గారంటీ లేదు. కష్ట పడి ఏ ఫస్ట్ గేర్ లోనో అప్ ఎక్కేసిన పాత కాలం బండి ఈజీగా డౌన్ దిగి పోయినట్టు, ఈవిడ నీ పెళ్ళైన తర్వాత ఇంకా హేపీగా బ్రతికేసినా బ్రతికేస్తుంది. అలాగని రిస్క్ తీసుకో లేను. ఇవన్నీ ఒకెత్తయితే, నీకింక పెళ్ళి సంబంధాలు వెతికే ఓపిక నాకు లేదు! ఆపై నీ ఇష్టం!" అని శుభం కార్డు వెయ్యకుండా 'ఇది అంతం కాదు! ఆరంభం' అని ముగించేసే సినిమాలా ఆపేశాడు అహోబలరావు.

'ఆస్తి చేతిలో ఉంచుకుంటే గానీ నీ మాట వినరే వీళ్ళు' అని చెప్పి పోయిన మొగుడి మాట ప్రకారం ఇప్పుడు వీళ్ళని ఓ ఆట ఆడిస్తున్న సదరు నాయనమ్మ, భాగీరధమ్మ ఈ సంభాషణలు విని ముసిముసి నవ్వులు నవ్వుకుంది. అది చూసి, ఇదో పిచ్చిది.. ఎప్పుడూ నవ్వుతుందో, ఎప్పుడూ మూలుగుతుందో తెలీదు అనుకుంటూ అక్కడ నుండి వెళ్లి పోయాడు అహోబారావు. ఆవిడ చాలా రోజులై, తన గురించి వీళ్లేమనుకుంటున్నారో తెలుసుకోవాలంటే ఒకటే మార్గమని, తనకి చెవుడు వచ్చినట్టుగా నటించ సాగింది. తన గురించి వాళ్ళు అనుకునేవి విన్నప్పుడు, నచ్చితే నవ్వుకోవడం, లేక పోతే ఏదో నొప్పి కలిగినట్టుగా మూలగడం నేర్చుకుంది. ఆ విషయం చాలా రహస్యంగా మేనేజ్ చేస్తోంది ఆవిడ ఆ వయసులో కూడా. ఇవేవీ తెలీని, అహోబలరావు ఆవిడకి వినబడదులే అనుకునే కొడుక్కి ఆ పెళ్ళి విషయం ఆవిడ ఎదురు గానే చెప్పాడు.

ఇంత జరిగాక, ఇప్పుడు మొండికేస్తే, ఇంకో నాలుగేళ్ళ దాకా పెళ్లి కాదనే భయంతో, 'కొంచెం లావే గానీ, పర్వత అన్న విశేషణం తీసేస్తే వర్ధనికేం? బానే ఉందిగా! నాన్నా చెప్పిందీ నిజమేగా' అనుకుని పెళ్లికొప్పేసుకున్నాడు కైలాస గిరి, అసలియన్ని మించిన సమర్ధుడు ఎవరు' అని గతంలో తెగ తిట్టిన నోటి తోనే పొగిడినట్టుగా. ఆపై వర్ధని పై మనసు పారేసుకుని, ఆమెతో సెల్లులో సొల్లు సంభాషణ, పెళ్లి కుదిరిన అందరు పిల్ల ల్లాగే తానూ మొదలెట్టాడు. "నిన్ను గిరీ అని పిలిచేదా?" అనడిగింది మొదటి సంభాషణ లోనే వర్ధని. అది వింటూనే 'ఆహా ఏమి నా భాగ్యమూ! నా పేరులో కైలాసం, తన పేరులో పర్వతం .. రెండూ

హిమాలయాలకి పోయి కైలాస పర్వతంలా స్థిరంగా ఉండి పోయాయి.' అని ఆనందించి, "వావ్! ష్యూర్!" అన్నాడు.

వర్ధని తండ్రి మైనాక మూర్తి కొంచెం మైనర్ కుటుంబం నుంచే రావడం వల్ల కొన్ని కొన్ని ఖర్చుల విషయంలో కాస్త మైజర్ (పిసినారి) గానే ఉంటాడు. పెళ్ళి విషయంలో అతనికి కొన్ని స్థిర అభిప్రాయాలు ఉన్నాయి. అనవసర ఖర్చులు తగ్గించి, కావలిస్తే ఆ డబ్బులు పిల్లలకే ఇచ్చేస్తే వాళ్ళేవైనా వస్తువులు కొనుక్కోవడానికి ఉపయోగ పడతా యనేది అతని భావన. ఆ ప్రకారమే అతను సంబంధం ఖాయం చేసుకోవడానికి ముందే, పెళ్ళి తంతు, పెళ్ళి ఖర్చులు అన్నీ ఎలా ఉండ బోతాయో చాలా వివరంగా తన కాబోయే వియ్యంకుడు అహోబలరావుకి చెప్పి, చివరిగా తను చేయ బోయే ఏర్పాట్లిలా ఉంటాయో కూడా ఒక ఊహా చిత్రాన్ని చూపించేశాడు. ఆ ఊహా చిత్రంలో మైనాక మూర్తి చేయ బోయే పెళ్ళి ఫుల్ లెంగ్త్ లో కనబడి, "ఇదేంటండీ బావ గారు!? మరీ కక్కుర్తిగా పెళ్ళి చేశారని నలుగురు అనుకోరా? నాకేం నచ్చలా" అన్నాడు అహోబలరావు.

"అనుకునే వారు ఎప్పుడూ అనుకుంటారండీ. మనం ఎంత ఘనంగా ఏర్పాట్లు చేసి పెళ్ళి చేసినా, వచ్చిన వాళ్ళల్లో ఒకరిద్దరికి ఎక్కడో అసౌకర్యం కలిగిందనుకోండి " ఏర్పాట్లేమీ బాగా లేవు. భోజనాల దగ్గరైతే చచ్చేమనుకో" అన్న స్థాయి లో అనేస్తారు. అలాంటి వాళ్ళతో మనకేం పని బావ గారు. మీరే చెప్పండి ! ఏ పెళ్ళిలో చూసినా, కళ్యాణ మండపం అద్దె రోజుకి లక్షో లేదా ఆరు గంటలకి అరవై వేలు చొప్పునో ఉంటోంది. పైగా కరెంటు, లైట్ల డెకరేషన్, స్టేజి డెకరేషన్ కి వేరే లక్షల్లో పెట్టాలి. పెళ్ళిముహూర్తం ఎలాగూ రాత్రే అయింది కనుక, మీరంతా రావడానికి, ఉండడానికి కళ్యాణ మండపం రెండ్రోజుల అద్దె, ఆ రెండ్రోజుల డెకరేషన్ వగైరాలకి ఓ పది లక్షల దాకా అయేటట్టుంది. ఇంత చేసినా పెళ్ళి ముహూర్తం టైం కి ఉండేది మీ వేపైనా, మా వేపైనా బాగా దగ్గరి బంధువులు, ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు మాత్రమే. ఆ ఫోటో గ్రాఫర్లు, వీడియో వాళ్లు కూడా కళ్యాణ మండపం చుట్టూ గుమిగూడి, కనీసం ఆ ఉన్న వాళ్లని కూడా పెళ్ళి చూడనివ్వరు. అందరూ ఆ తర్వాత తీరిగ్గా ఇంటరెస్ట్ ఉంటే వీడియోలు, ఫోటోలు చూసుకోవడమే.

ఇక పెళ్ళికి పిలిచిన వాళ్ళందరూ, పెళ్ళి భోజనాల టైం ఎప్పుడైతే అప్పుడే వస్తారు. వాళ్ళ కోసం రిసెప్షన్ ఏర్పాటు చేసి పెళ్లి కూతురు, పెళ్లి కొడుకుని కూర్చో బెడితే వాళ్ళ చేతిలో ఏ గిఫ్టో పెట్టి, తినేసి వెళ్లి పోతారు. అందుచేత పూర్వ కాలం సామెతలా పిల్ల పెళ్లి చెయ్యవా అని అడగకుండా "పప్పన్నం ఎప్పుడు పెడతావ్?" అనడిగినట్టు, పెళ్ళంటే "భోజనమే!". అసలీ కాలం లో పెళ్ళి భోజనం అనేది కూడా ఓ పెద్ద స్టేటస్ సింబల్ అయిపోయింది. ప్లేటుకి ఆరు వందల చొప్పున ఇస్తేనే గాని ఎవడూ కేటరింగ్ కి రాడు. పైగా ఇప్పుడు ఈసుకి, గొప్పకి ఓ ఇరవై కౌంటర్లు పెట్టి వాటిలో ఇడ్లీలు, రక రకాల దోసెలు, రోటీలు, పూరీలు, పానీ పూరీలు, ఛాట్లు, సమోసాలు, బార్బికీలు, అయిదారు రకాల ఫ్రైడ్ రైసులు, రక రకాల కూరలు, సాంబార్లు, రసాలు..పదిరకాల అప్పడాలు, పచ్చళ్లు.. ఇవికాక ఇంకో పదిరకాల స్వీట్లు, ఐస్ క్రీంలు...ఇలా అంతులేని తిళ్ళతో మనల్ని మనమే దోచేసుకుని, ఎవడి చేతిలోనో ఆ డబ్బు పెట్టాలి. ఇంతా చేసి, తీరా పెళ్ళి తంతు అంతా అయ్యాక మనం భోజనానికెళ్తే, అక్కడ చాలా అయిటెమ్స్ అయిపోయి మనకి ఒక పప్పో, కూరో మిగుల్తుంది అదే ఆరు వందల ప్లేట్ ఖరీదుకి. ఇవి కాక మన ఇంట్లో వాళ్ళ సంతోషం కోసం తప్పించుకో లేని బట్టల, నగల ఖర్చు ఎలాగూ ఉండనే ఉంటుంది. .

అందువల్ల వీటన్నిటిలోంచి నేను తప్పించ గలిగే ఖర్చు కళ్యాణ మండపాలు, లైట్లు, డెకరేషన్లు, భోజనాలు వగైరా. అసలు కొంత మందైతే తమ ఇంటి ముందు రోడ్ బ్లాక్ చేసి, షామియానా వేసి మరీ హేపీగా పెళ్ళి చేసేస్తున్నారు. మరీ అంతలా కాకపోయినా కాస్త హుందాగా మా సెల్లార్లో పెళ్ళి ఏర్పాటు చేస్తా. మా అపార్ట్ మెంట్ లోని ఓ రెండు పోర్షన్లు ఖాళీ గా ఉన్నాయి. వాటిని మీకు విడిదిగా ఏర్పాటుచేస్తా. ఇవన్నీ చిన్న చిన్న ఖర్చులే. అంతగా దగ్గర వాళ్ళు అడిగితే, కళ్యాణ మండపాలు అస్సలు దొరకందే!? అని ఓ నిస్సహాయపు మొహం పెడదాం. ఏమంటారు?" అని గుక్క తిప్పుకోకుండా చెప్పి, ఓ క్షణం ఆగి, అహోబలరావు ఏమైనా అనేస్తాడేమో నని, మళ్ళీ తానే మొదలెట్టాడు మైనాక మూర్తి.

"అసలు పెళ్ళి శుభ లేఖ లోనే రిసెప్షన్ ఫలానా చోట అంటే చాలు అందరూ అక్కడికే చేరి పోతారు. ముహూర్తం ఎప్పుడన్నది కూడా చూడరు. అందుచేత పెళ్లయ్యాక ఏదో ఒక హోటల్ లోనో, ఫంక్షన్ హాల్లోనో ఓ సాయంత్రం డిన్నర్ ఇచ్చేద్దాం. అదీ శనివారం పెట్టామనుకోండి, సింపుల్ గా పుల్కాలో, పూరీలో, ఇడ్లీలో పెట్టి ఆపై కడుపులో ఉపశమనానికి దద్ధోజనం పెడితే సరిపోతుంది. మన వాళ్లకి శని వారం రాత్రి టిఫిన్ అలవాటు ఎక్కువేగా. దాంతో పెళ్ళి భోజనం పెట్టినట్టూ ఉంటుంది, ఖర్చు తగ్గించినట్టూ ఉంటుంది. అలా మిగిల్చిన డబ్బులు పిల్లలకే గిఫ్ట్ కింద మనం ఇచ్చేద్దాం! ఏమంటారు? అసలేమనద్దు! మీరు ఊ అనండి చాలు! నేనెలాంటి ఏర్పాట్లు చేస్తానో చూద్దురుగాని అన్నాడు మైనాకమూర్తి , ఇంకో చాన్స్ మీకు లేదు 'ఊ!' అనడం తప్ప అన్నట్టు.

'ఊ కొడతారా? ఉలిక్కిపడతారా?' అన్న సినిమా టైటిల్లా అహోబలరావు ఊ అనలేక, ముందు ఉలిక్కిపడి, ఆపై కాస్త మావాళ్ళతో ఆలోచించుకొనీండి అని బయట పడి, ఇంటికి రాగానే ఇంట్లో వాళ్ళతో అత్యవసర సమావేశం పెట్టాడు, అంతా విని అప్పటికే వర్ధనితో ఛాటింగ్ మోజులో పడ్డ గిరి, 'ఊ' అన్నాడు, ఉలిక్కి పడితే వర్ధని ఎక్కడ మిస్ అయిపోతుందో ననే భయంతో. ముసిముసి నవ్వులు నవ్వుతూ, అంతలోనే మూలుగుతున్న అత్తగార్నే చూస్తూ, ఏమనాలో తోచక, 'ఊ' అంది అతని భార్య. వాళ్ళిద్దరు ఊ అన్నాక, తను ఉలిక్కి పడితే ... నాలుగేళ్ళ దాకా పెళ్ళి కాని కొడుకు, అప్పటి దాకా బ్రతికే ఉంటానని ఛాలెంజ్ చేసిన అమ్మ నాలుగేళ్ళ తర్వాత ఎలా ఉంటారో కళ్ళ ముందు మెదిలి, అర్జెంట్ గా మైనక మూర్తి కి ఫోన్ చేసి "ఊ!" అన్నాడు అహోబల రావు ఇంక ఒంట్లో బలం లేని వాడిలా.

ఆ ప్రకారం మైనాక మూర్తి పెళ్ళి తన అపార్ట్మెంట్ సెల్లార్లో ఏర్పాటు చేశాడు, అపార్ట్మెంట్ అసోసియేషన్ కి ఓ పాతిక వేలు డొనేషన్ ఇవ్వడానికి, అందులో ఉంటున్న వాళ్లందర్నీ పెళ్లి రోజు రెండు పూటలా టిఫిన్, భోజనాలకి పిలిచే కండిషన్ మీద. అనుకున్నట్టు గానే అర్ధరాత్రి ముహూర్తంలో ఓ ముప్పై మంది దగ్గరి బంధువుల నడుమ, అట్టహాసంగా కాక పోయినా మందహాసాలతో.. ఫోటో, వీడియో గ్రాఫర్ల డైరెక్షన్ మధ్య నిమిత్త మాత్రుడైన పురోహితుని సాక్షిగా గిరి వర్ధనిల పెళ్ళి జరిగి పోయింది. ఆతర్వాత వచ్చిన శని వారం నాడు ఓ హోటల్లో సాయంత్రం రిసెప్షన్ ఏర్పాటు చేసి, ఇడ్లీల పుల్కాల విందు ఏర్పాటు చేశాడు మైనాక మూర్తి. ఆ రిసెప్షన్ కి వచ్చిన వాళ్ళందరూ పెళ్ళికి పిలవ లేదేం అని శాంపిల్ గా కూడా అడగకుండా శని వారపు టిఫిన్లు సుష్టుగా ఆరగించి,

"టిఫిన్లు పెట్టి మంచి పని చేశారు. మీరు గాని ఏ షోడశ రుచుల విందు గాని ఏర్పాటు చేసుంటే, శనివారపు నియమం వదులుకో

లేక, వాటిని తినడం మాన లేక తెగ ఇబ్బంది పడుండే వాళ్లం. అల్కాగా పుల్కాల విందు భలే ఉంది" అని వధూ వరులని దీవించడం మర్చి పోయి, పుల్కాలని మెచ్చుకు వెళ్లిపోయారు. మొత్తానికి సెల్లార్లో పెళ్ళేంటయ్యా బాబూ అని ఎవరూ అనకుండా, పెళ్ళి బాగా జరిగి పోవడంతో అహోబలరావు చాలా సంతోషించి, మైనాక మూర్తిని మెచ్చుకున్నాడు. మైనాక మూర్తి తనన్నమాట ప్రకారం గిరి, వర్ధనిల పేర చెరో మూడు లక్షలు ఫిక్స్ డ్ డిపాజిట్ చేశాడు. మనవడి పెళ్లిని ముసిముసి నవ్వుతో వీల్ ఛైర్లో కూర్చుని తిలకించిన బాగీరధమ్మ," అమ్మయ్య! వీడి పెళ్ళి చూసాను. ఇంక వీడి కొడుకునో, కూతుర్నో చూసి అప్పుడు పోతే పోలా!?.. అయినా ఇప్పుడేమంత వయసు మించి పోయిందనీ నాకు!?" అనుకుంది ఆనందంగా.




స్నేహితుడు దివాకర్ కు సీరియస్ గా ఉన్నదని తెలిసిన మరు క్షణం క్రిష్ణ పట్నం బయలు దేరాడు బుచ్చి బాబు.

బస్సు దిగిన వెంటనే టిఫిన్ కూడా చేయకుండా తిన్నగా హాస్పిటల్ కు వెళ్లాడు.

స్నేహితుడు దివాకర్ ఐ.సి.యూ లో ఉన్నాడని తెలుసు కుని అక్కడికి చేరుకున్నాడు బుచ్చి బాబు.

ఐ.సి.యూ బయట కుర్చోనున్న దివాకర్ భార్య మాలిని, బుచ్చి బాబును చూసిన వెంటనే పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది.

"ఊరుకో చెల్లెమ్మా. దివాకర్ కు ఏమీ కాదు. నువ్వు ధైర్యంగా ఉండు...ఇంతకీ అసలేం జరిగింది. దివాకర్ని ఐ.సి.యూ లో పడుకో బెట్టే టంత పెద్ద జబ్బు చేసిందంటే వాడికి ఈ జబ్బు ఇది వరకే ఉండుండాలి. డాక్టర్లకు చూపించుకోలేదా" మాలినిని అడిగాడు బుచ్చి బాబు.

"లేదన్నయ్యా...ఆయనకు ఎటు వంటి జబ్బూ లేదు. అదే నాకు ఆశ్చర్యంగా ఉంది. సాయంత్రం నాలుగింటికి నాకు కబురొచ్చింది. మీ ఆయనకు చాలా సీరియస్ గా ఉంది, మీరు వెంటనే బయలు దేరి రండి అని చెబితే వెంటనే బయలు దేరి వచ్చాను. వచ్చిన వెంటనే డాక్టర్లు కలవమన్నారు అని చెబితే వెళ్ళి కలిశాను" ...వస్తున్న ఏడుపును దిగమింగుకోవటానికి ప్రయత్నిస్తూ కొంగుతో కళ్ళు తుడుచుకుంది మాలిని.

"డాక్టర్లు ఏం చెప్పారు" అడిగాడు బుచ్చిబాబు.

"మీ ఆయనకు జబ్బేమీ లేదమ్మా...ఏదో షాకింగ్ న్యూస్ వినడం వలన షాక్ లో ఉన్నారు. ఆ షాక్ వలనే మాటా-మంతీ లేకుండా మూర్ఛ పోయారు. ట్రీట్ మెంట్ ఇచ్చినా గాని లేవ లేదు. అందుకని ఐ.సి.యూ లో అబ్జర్వేషన్ లో ఉంచేము అని చెప్పారు "

"అంతలా మూర్ఛ పోయేటంత బ్యాడ్ న్యూస్ ఏం వినుంటాడు చెల్లెమ్మా?"

"అదే అర్థం కావటం లేదు అన్నయ్యా... ఉదయం స్కూలుకు వెళ్లేటప్పుడు మామూలు గానే ఉన్నారు. ఇదిగో సాయంత్రం ఇలా..." దుఃఖం గొంతుకు అడ్డు పడుతుంటే మాలిని మాట్లాడ లేక పోయింది.

"ఊరుకో చెల్లెమ్మా. దివాకరం కు ఏమీ కాదు...నేను వెళ్ళి ఒక సారి డాక్టర్ను కలిసి డీటైల్ గా విషయం తెలుసుకొస్తా" అంటూ అక్కడి నుండి బయలు దేరాడు బుచ్చి బాబు.

"సారీ బుచ్చి బాబు గారు...మీ స్నేహితుడు దివాకర్ ఆరోగ్య విషయంలో ఇంత కంటే మేము ఏమీ చెప్ప లేము. ఐ మీన్, ఇంత కంటే చెప్పటానికి ఏమీ లేదు. ఆయనకు ఏ జబ్బూ లేదు. బి.పి నార్మల్, పల్స్ నార్మల్, హార్ట్ బీట్స్ నార్మల్, వైటల్ ఆర్గన్స్ ఆర్ ఫంక్షనింగ్ నార్మల్...హీ ఈజ్ నాట్ ఇన్ కోమా...షాక్...షాక్ లో ఉన్నారు. షాక్ తగిలితేనే అలా అవుతారు. ఫిజికల్ షాక్

తగిలినట్లు సూచనలు లేవు...కాబట్టి మెంటల్ షాక్ తగిలుండాలి. ఆయన్ను హాస్పిటల్ కు తీసుకు వచ్చిన వారికి కూడా ఏమీ తెలియదు. ఎందుకంటే రోడ్డు మీద పడి పోయుంటే తీసుకు వచ్చి చేర్చారు. కాబట్టి అయన షాకుకు కారణం ఆయనే చెప్పాలి...అంత వరకు మనం ఆగాలి" చెప్పాడు డాక్టర్.

బుచ్చి బాబు డాక్టర్ రూము నుండి బయటకు వచ్చాడు. అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. చివరి సారిగా తాను దివాకర్ ను కలిసిన సంఘటనను గుర్తుకు తెచ్చుకున్నాడు.

**********************************

క్రిష్ణ పట్నం రిజిస్ట్రార్ ఆఫీసు నుండి బయటకు వస్తున్న బుచ్చి బాబు కు దివాకర్ అటుగా వెళ్లటం కనిపించింది. "దివాకరం...ఒరేయ్ దివాకరం" అని అరిచాడు.

దివాకర్ ఆగాడు. ఎవరు పిలిచారా అని వెనక్కి తిరిగి చూశాడు. తన స్నేహితుడు బుచ్చి బాబు కనబడ్డాడు.

"బుచ్చి బాబూ...ఏమిటిలా చెప్పా పెట్టకుండా మా ఊరొచ్చావు!" ఆశ్చర్యంగా అడిగాడు దివాకర్.

"చెప్పేటంత టైము కూడా దొరక లేదు దివాకర్. అందుకే నేనొస్తున్నట్టు నీకు ముందుగా ఇన్ ఫార్మ్ చేయ లేక పోయాను...అది సరే నువ్వేంటి ఇలా చిక్కి పోయావు. ఒక పట్టాన గుర్తు పట్ట లేక పోయాను"

"చిక్కి పోలేదురా...స్లిమ్ముగా తయారయ్యాను"

"ఏదో ఒకటిలే... వొళ్లు తగ్గించమని డాక్టర్ గాని చెప్పాడా?"

"డాక్టర్ చెప్పలా... డైరక్టర్ చెప్పాడు"

"ఈ మధ్య మీ గవర్నమెంట్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ డైరక్టర్లు ఈ పని కూడా మొదలు పెట్టారా!?"

"మా ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ డైరక్టర్ కాదు...సినిమా డైరక్టర్"

"సినిమా డైరక్టరా...!?" బుచ్చిబాబు తన ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"ఓ...నీకు విషయం తెలియదు కదూ. అవును మనం కలుసుకుని చాలా రోజులయ్యింది. అందుకనే నేను చెప్పేది నీకు కొత్తగా ఉంది. నీకు అసలు విషయం చెప్పాలి...రా...అలా ఆ టీ క్యాంటీన్ లో కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ అటు వైపుకు నడిచాడు దివాకర్. బుచ్చిబాబు స్నేహితుడిని అనుసరించాడు. ఇద్దరూ టీ క్యాంటీన్లో కూర్చున్నారు.

"నేను సినిమాలో నటించ బోతున్నాను" చెప్పాడు దివాకర్. అప్పుడే వేడి వేడి టీ గ్లాసును నోటి దగ్గర పెట్టుకున్న బుచ్చిబాబు, దివాకర్ చెప్పిన మాటకు ఉలిక్కి పడటంతో వేడి వేడి టీ అతని పెదవులను తాకింది. "అబ్బా" అంటూ టీ గ్లాసును కింద పెట్టాడు.

"షాక్ తిన్నావు కదూ...నేను ఈ మాట చెప్పిన వెంటనే అందరూ షాక్ తింటున్నారు. కాని నేను చెప్పేది నిజం"

"రేయ్ దివాకరం...నువ్వు హీరోలాగా ఉంటావనేది అక్షరాలా నిజం. నేనే ఈ విషయాన్ని నీ దగ్గర చాలా సార్లు చెప్పాను...అది మాట వరసకే గాని బంగారం లాంటి గవర్నమెంట్ ఉద్యోగం మానుకుని సినిమాల్లో చేరమని ఇచ్చిన సలహా మాత్రం కాదు"

"అయ్యుండచ్చు...కానీ నన్ను వెతుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని నేను వదులుకుంటే...బహుశ నా అంత దురదృష్టవంతుడు ఇంకొకడుండడు"

“దివాకరం సినిమా అంటే ఒక ‘మాయ’ రా. ఒక జీవిత కథని రెండు గంటల్లో చూపించి ముగించే ఒక ఇంద్రజాల వేదికరా అది. మంత్ర దండం అనేది ఒక కర్ర ముక్కే తప్ప, అందులో ఏమీ ఉండదని గౌతమ బుద్ధుడు చెప్పినా, అందులో మంత్ర శక్తి ఉంటుందని చూపించి నమ్మించేదే సినిమా రా. నిజ జీవితంలో జరగటానికి వీలు లేని సంఘటనలను జరిగినట్లు, జరుగుతాయన్నట్లు చూపించేది సినిమా...అలాంటి ఇంద్ర జాల వేదికను ఎక్కాలని ఆశ పడకురా. ఆ వేదిక ఎక్కి హిమాలయా పర్వతాలంత ఎత్తుకు ఎదిగి పోవాలని అత్యాశ పడిన వారెందరో అధ:పాతాళానికి పడి పోయారు"

"చూడు బుచ్చి బాబు... ‘ సినిమా’ అని చెప్ప గానే అదేదో తప్పుడు పదం అన్నట్టు ఫీలయ్యే వారే ఎక్కువగా ఉన్నారు. నువ్వూ ఆ కోవకు చెందిన వాడివే. కాని నాలాంటి హీరో పోలికలు ఉన్న వాడు అలా ఫీలవ కూడదు...అందు లోనూ వెతుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని చేజార నివ్వ కూడదు"

"నిజం గానే వెతుక్కుంటూ వచ్చిందా?...నిజం చెప్పు"

అబద్ధం చెప్పటం చేత కాని దివాకర్ "లేదనుకో...హీరోలు కావలెను అని పేపర్లో ప్రకటన వస్తే, అది చూసి నేను అప్లై చేశాను" అని నిజం చెబుతూ "నాలాగా ఎన్నో వేల మంది చేసుంటారు కదా...అందులో నన్ను సెలక్ట్ చేశారంటే, అవకాశం నన్ను వెతుక్కుంటూ వచ్చిందనేగా అర్ధం" అంటూ తన వాదాన్ని జస్టిఫై చేశాడు.

"సరే...నేను ఎంత చెప్పినా నువ్వు వినిపించుకోబోయేది లేదు. నువ్వే కాదు సినిమా వేదిక పైన మోజు పెంచుకున్న వాళ్లెవరూ వినిపించు కోరు. అదే సినిమా అన్న మాటకున్న మహాత్యం. అయినా స్నేహితుడువి కాబట్టి చివరిగా ఒకే ఒక మాట చెబుతాను. సాఫీగా సాగి పోతున్న నీ జీవిత ప్రయాణాన్ని అనవసరమైన ఆశలతో మలుపు తిప్పుతూ ప్రమాదాలను కొని తెచ్చుకోకు...సరేనా" అంటూ అక్కడ్నుండి బయలు దేరాడు బుచ్చి బాబు.

"సరే...సరే" అని సమాధానం చెబుతూ ఫ్రెండును సాగనంపాడు దివాకరం.

********************

"ఏమిటన్నయ్యా...ఇక్కడే కూర్చుండి పోయావు" అని అక్కడ కొచ్చిన మాలిని అడగటంతో ఈ లోకం లోకి వచ్చాడు బుచ్చి బాబు.

"డాక్టర్ ని కలవ లేదా?" అడిగింది మాలిని.

"కలిశాను చెల్లెమ్మా. నువ్వు చెప్పిందే చెప్పారు. జబ్బు ఏమి లేదు...షాక్ లో ఉన్నారు అంటున్నారు"

“నేను చెప్పానుగా అన్నయ్యా" అన్నది మాలిని.

"సరే. నాకో విషయం చెప్పు...ఈ మధ్య దివాకర్ లో ఏదైనా మార్పు గమనించావా?"

"మార్పంటే?"

"మాటల్లో...ప్రవర్తనలో..."

"మాటల్లో, ప్రవర్తనలో మార్పులేమీ కనిపించ లేదు. కానీ ఆయన చేష్టలలొ కనిపించింది"

"ఏమిటా మార్పులు?...చెప్పు"

"స్కూలుకు వెళ్ళేటప్పుడు పంచె కట్టుకు వెళ్ళే వారు కదా...ఈ మధ్య ప్యాంటులు వేస్తున్నారు. అందులోనూ ఇన్ షర్ట్ చేసుకుంటున్నారు. చెప్పులకు బదులు షూ వాడుతున్నారు. తల వెంట్రుకలను నాలుగైదుసార్లు దువ్వుకుంటూ, ఏవో ఫేస్ క్రీములు, సెంట్లు వాడుతున్నారు. తిండి కూడా తక్కువ తింటున్నారు"

"ఇవన్నీ ఎందుకు చేస్తున్నాడో నువ్వెప్పుడూ అడగ లేదా?"

"ఎందుకడగలా...అడిగాను. సినిమాలో చాన్స్ వచ్చిందని చెప్పారు. ఎలా వచ్చింది, ఎప్పుడొచ్చింది అని అడిగేను. ఆరు నెలల క్రితం

హీరోలు కావలెను" అని ప్రకటన చూశారట. ఆ ప్రకటనలో వాళ్ళడిగినట్లు ఈయన ఆరు ఫోటోలు, ఈయన వివరాలు అన్నీ తెలుపుతూ వాళ్ళకు అప్లికేషన్ పంపారట. రెండు నెలల క్రితం వాళ్ళ దగ్గర నుండి జవాబు వచ్చిందట...అప్పట్నుంచి ఆయనలో ఈ

మార్పులు గమనించాను"

"ఏమని జవాబు వచ్చిందో చెప్పాడా?"

“సినిమా ప్రొడ్యూసర్, డైరక్టర్ మా ఊరు వస్తారట. వచ్చే ముందు కబురు పెడతాము...మమ్మల్ని వచ్చి కలవాలని రాశారట"

"మరి వచ్చారా?"

"లేదు. ఇంకా రాలేదు. ఈ రోజు వరకు రాలేదు. త్వర లోనే వశ్తారట. పొద్దున స్కూలుకు వెడుతున్నప్పుడు కూడా అదే మాట చెప్పారు. వాళ్ళు వచ్చిన రోజున ఈయన సినిమా హీరోలా కనిపించాలట. చూసిన వెంటనే వీడు కదా మనం వెతుకుతున్న హీరో అనుకుంటూ, ఇన్ని రోజులు సినిమా ఇండస్ట్రీ కి ఎందుకు కనిపించ లేదు అని వాళ్ళు అడగాలట...అంత ఆశగా, ఆనందంగా చెప్పి వెళ్ళిన ఆయనకు సాయంత్రం ఇలా ఎందుకు జరిగిందో అర్ధం కావటం లేదు"

ఇంతలొ అక్కడికి ఒక నర్స్ వచ్చి "మాలిని గారంటే మీరేనా...డాక్టర్ గారు మిమ్మల్ని ఐ.సి.యూ దగ్గరకు రమ్మంటున్నారు" అని చెప్పి వెళ్ళి పోయింది.

మాలిని, బుచ్చి బాబు ఐ.సి.యు దగ్గరకు వెళ్లేరు. అక్కడ డాక్టర్ కనబడ్డాడు “చూడమ్మా...మీ ఆయనలో కొంచంగా కదలికలు కనిపిస్తున్నాయి. ఎప్పుడైనా పూర్తి స్పృహ లోకి రావచ్చు. కాబట్టి మీరు దగ్గరే ఉండండి. స్పృహ లోకి వచ్చిన వెంటనే, ఆయన షాకుకు కారణమేమిటో అడిగి తెలుసుకోండి...ఆయన స్పృహ లోకి వచ్చిన కొద్ది నిమిషాలలో మళ్లీ షాకు లోకి వెళ్లి పోవచ్చు. వెళ్తారని ఖచ్చితంగా చెప్ప లేను... వెళ్లచ్చు. ఆయన షాకుకు కారణ మేమిటో తెలుసు కుంటే బెటర్ ట్రీట్ మెంట్ ఇవ్వచ్చు" చెప్పాడు డాక్టర్.

మాలినికి దుఃఖంతో మాట రాలేదు.

బుచ్చి బాబు మాత్రం "మీరు చెప్పినట్టే చేస్తామండి" అని చెప్పి అక్కడే కూర్చున్నాడు.

**********************************

స్కూలు ఆవరణలో ఉన్న చెట్టు క్రింద పిల్లలకు పాఠాలు చెబుతున్న దివాకర్ దగ్గరకు ఒక కుర్రాడు వచ్చాడు. వాడిని చూసిని దివాకర్ "ఎవరు నువ్వు...ఎందుకొచ్చావు" అని అడిగాడు.

"నేను వెంకట రమణ విలాస్ హోటల్లో రూమ్ బాయిగా పని చేస్తున్నాను. మా హోటల్లో దిగిన ఒక పెద్ద మనిషి మీకు ఈ చీటీ ఇచ్చి రమ్మన్నారు" అని చెప్పి దివాకర్ చేతిలో ఒక చీటీ పెట్టి వెళ్లి పోయాడు.

దివాకర్ ఆ చీటీని విప్పాడు. "వెంటనే వచ్చి నన్ను కలవండి...ప్రొడ్యూసర్ & డైరెక్టర్ తిక్క సుబ్బులు" అని రాసుంది.

ఆనందంతో వెంటనే అక్కడి నుండి బయలు దేరాడు దివాకర్. తిన్నగా హోటల్ కు వెళ్లాడు. ప్రొడ్యూసర్ ఏ రూములో ఉన్నాడో తెలుసుకుని ఆ రూము దగ్గరకు వెళ్లాడు. ఒక సారి డ్రస్స్ సరి చేసుకుని, తల దువ్వుకుని, ముఖం తుడుచు కుని "మే ఐ కమిన్ సర్ " అన్నాడు.

"మిస్టర్ దివాకర్"

"అవును సర్ "

"రండి. లోపలకు రండి. మీ కోసమే వెయిట్ చేస్తున్నాను...అలా కూర్చోండి" అంటూ దివాకర్ కు కుర్చీ చూపించాడు.

దివాకర్ కూర్చున్నాక "మీరు పంపిన అప్లికేషన్ చూశాను. అందులో మీరు మీ స్కూల్ గురించి బాగా వివరించారు...మీ స్కూల్ గురించి మరి కొన్ని వివరాలు తెలుసుకోవాలని మిమ్మల్ని కలవటానికి మీ ఊరు వచ్చాను" "అడగండి సర్...చెబుతాను"

"మీ స్కూలు పేరేమిటి?"

"మా స్కూలు గవర్న మెంట్ స్కూలండి. కానీ మా స్కూలుకు ఇంకో పేరుంది. ఆ పేరు చెబితేనే అందరికీ ఈజీగా అర్ధమవుతుంది"

"అదే...దాని గురించే అడుగుతున్నా"

"నాకు ముందు మా నాన్న గారు చాలా రోజులుగా ఈ స్కూల్ లో పని చేశారు...ఈ స్కూల్ లో హెడ్ మాస్టర్, మాస్టర్, ప్యూన్ అన్నీ ఆయనే. ఆయన ఎప్పుడూ బఠానీలు తింటూ ఉండేవారు. పిల్లలకు కూడా పెడుతూ ఉండేవారు. చాలా రోజులుగా ఆయన నడిపిన స్కూలు ఇది. అందుకని అందరూ మా స్కూలును "బఠానీల మాస్టారు స్కూలు" అంటారు"

"పేరు చాలా బాగుంది...స్కూలు పేరు మార్చుకోవటానికి మీకేమన్నా అభ్యంతరముందా?"

"మార్చుకో వచ్చు...ఎందుకు అడుగుతున్నారు?"

"స్కూల్ ని సబ్జెక్ట్ గా పెట్టి ఒక సినిమా తీయ బోతున్నాను"

“సంతోషం సర్...చాలా సంతోషంగా ఉంది. ఈ రోజుల్లో స్కూల్ ల గురించి సినిమాలు ఎవరు తీస్తున్నారు సర్. తీయండి సర్. ప్రస్తుతం గవర్నమెంట్ స్కూల్ లు ఎలా ఉన్నాయో, ఆ స్కూల్ లో పిల్లలు ఎలా చదువు కుంటున్నారో...అన్నిటి కంటే ఆ స్కూల్లో పనిచేసే మా లాంటి ఉపాధ్యాయులు ఎన్ని కష్టాలు పడుతున్నారో చూపించండి...అన్నట్లు నేను కూడా నటిస్తానండి" చెప్పాడు దివాకర్.

"మొదట కథ రెడి అవనివ్వండి...ఆ తరువాత మీరు నటించటం గురించి ఆలోచిస్తా. నేను మీ ఊరు వచ్చింది, మీ స్కూలు గురించి తెలుసుకుని, దానిపై ఒక కథ రెడీ చేయాలనే గాని మిమ్మల్ని నటుడిగా తీసుకోవటానికి కాదు" అసలు మాట చెప్పాడు ప్రొడ్యూసర్ & డైరెక్టర్ తిక్క సుబ్బులు.

దివాకరుకు మొదటి షాక్ తగిలింది...తమాయించుకున్నాడు."అడగండి" దివాకర్ స్వరం కొంచం నీరసించింది.

"మీ నాన్న గారు ఎలా ఉండే వారు...ఐ మీన్, ఆయన రూపం గురించి అడుగుతున్నా"

"కొంచం పొట్టిగా ఉండేవారు"

"కొంచం పొట్టిగా ఉండేవారా? లేక బాగా పొట్టిగా ఉండేవారా?"

"బాగా పొట్టిగా ఉండే వారనే చెప్ప వచ్చు"

"పొట్టి బతానీల మాష్టారు స్కూలు"...అని సినిమాకు టైటిల్ పెడితే సరిగ్గా ఉంటుందేమో"

"సరి పోతుందండి"

"పార్టనర్స్ ను అడిగి పేరులో మార్పు చేయాలంటే చేస్తాను"

"మీ ఇష్టం సర్"

"ఇది కూడా పేరులో చేర్చుకోవచ్చు లాగుందే...పొట్టి బతానీల మాస్టారు స్కూల్ లో మీ ఇష్టం. పొడుగ్గా ఉన్నా కొత్తగా ఉంది కదూ"

"అవునండి. మా వైపు స్కూలును బడి అని చెబుతారు"

"మంచి కాలం గుర్తు చేశారు...సినిమా బాగా ఆడాలంటే పేరు లోనే న్యాచురాలటీ ఉండాలి. పొట్టి బతానీల మాష్టారు బడిలో మీ ఇష్టం...బాగుందా"

"ఈ పేరు కోసమే సినిమా వంద రోజులు ఆడుతుంది సర్ "

"అది సరే...మీ బడిలో ఎంత మంది పిల్లలు చదువుతున్నారు?"

"ఎక్కడ చదువుతున్నారండి...మధ్యాహ్నం బోజనం తినేసి ఉరు తిరగడానికి వెళ్ళి పోతారు...ఒకటో నెంబర్ గాడిదలు"

"ఆహా...మీ చెయ్యి ఇలా ఇవ్వండొకసారి" అంటూ దివాకర్ చెయ్యి అందుకుని షేక్ హ్యాండ్ ఇస్తూ "సినిమా పేరు పూర్తిగా చెడి పోయింది...మీ బడీ వద్దూ...ఏమీ వద్దు" అన్నాడు ప్రొడ్యూసర్ & డైరక్టర్ తిక్క సుబ్బులు.

రెండో సారి షాక్ తిన్న దివాకర్ "ఏం చెబుతున్నారండి...!" ఆశ్చర్యంగా అడిగాడు.

“ఒకటో నెంబర్ గాడిదలు అన్నారే...అదే సినిమా పేరు. చెప్పి చూడండి. నోరూరుతుంది...ఒకటో నెంబర్ గాడిదలు. శబాష్. మీ ఊరు వచ్చినందుకు నా కొత్త సినిమాకు మంచి పేరు దొరికింది"

"మీరు రమ్మని కబురు పంపితే వచ్చాను. మా బడి పేరు మీ సినిమాకు ఉపయోగ పడదా?"

"వద్దు...దాని గురించి ఇంకో సినిమా తీసేటప్పుడు ఆలొచిస్తాను. ఇక మీరు వెళ్ళచ్చు"

ఆ మాటతో పూర్తిగా నిరాశ పడ్డ దివాకర్ వస్తున్న ఏడుపును దిగ మింగుకుంటూ "మీ సినిమాలో ఎలాగైనా మా బడి పేరు వచ్చేటట్లు చూడండి సర్" అన్నాడు దివాకర్.

"సరే...సరే...ఆలోచిస్తాను" అన్నాడు ప్రొడ్యూసర్, డైరక్టర్.

దివాకర్ లేచేడు. నీరసంగా అడుగులు వేసుకుంటూ హోటల్ రూము బయటకు వస్తుంటే "ఒక్క నిమిషం" అన్న ప్రొడ్యూసర్ మాట వినబడింది. వెనక్కి తిరిగి ప్రొడ్యూసర్ ను చూశాడు.

"పొట్టి బతానీల మాస్టార్ బడిలోని ఒకటో నెంబర్ గాడిదలు”...ఎలా ఉంది సినిమా పేరు" అన్నాడు.

"బ్రహ్మాండం...బ్రహ్మాండంగా ఉంది సర్" అని సంతోషంగా అరుస్తూ తిరిగి ప్రొడ్యూసర్ దగ్గరకు వచ్చాడు దివాకర్.

ప్రొడ్యూసర్ తన సూటు కేసులో నుండి కొంత డబ్బు తీస్తూ "ఇదిగోండి పది వేలు...సినిమా పేరు కోసం" అంటూ ఆ డబ్బును దివాకర్ చేతిలో పెట్టాడు.

"సంతోషంగా ఉందండి...చాలా సంతోషంగా ఉంది. డబ్బులు ఇచ్చినందుకు కాదు. సినిమాకు మా నాన్న గారి పేరు పెడుతూ సినిమా టైటిల్ ను ఖరారు చేసినందుకు...ఇక వెళ్లొస్తాను సర్" అని వెనక్కు తిరిగిన దివాకర్ ఏదో గుర్తొచ్చిన వాడిలా మళ్లీ ప్రొడ్యూసర్ వైపు తిరిగి "అన్నట్లు...సినిమా తీయడానికి మా ఊరు ఎప్పుడొస్తారు" అని అడిగేడు.

"మీరు ఓ ఇరవై గాడిదలను రెడి చేసి ఉంచండి. మా టెక్నికల్ టీమ్ వచ్చి అందులో కొన్ని గాడిదలను సెలక్ట్ చేసుకుంటుంది...ఆ తరువాత సినిమా మొదలు పెడతాం" చెప్పాడు ప్రొడ్యూసర్, డైరెక్టర్ తిక్క సుబ్బులు.

"నటించడానికి నాకొక ఛాన్స్ ఇస్తారా?" చివరి సారిగా రిక్వస్ట్ చేశాడు దివాకర్.

"సినిమా పేరేమిటి"

"పొట్టి బతానీల మాష్టారు బడిలోని ఒకటో నెంబర్ గాడిదలు"

"అందులో మీరే ఒకటో నెంబర్ గాడిద....సినిమాకు టైటిల్ ఫైనల్ చేసిన వెంటనే కథ డెవలప్ చేసేశాను. అలా కూర్చోండి...టూకీ గా కథ చెప్తాను"

అంత వరకు షాక్ తో నీరసంగా ఉన్న దివాకర్ ఒక్క సారిగా బలం వచ్చినట్లు ఫీలయ్యాడు. అక్కడున్న కుర్చీని ప్రొడ్యూసర్ దగ్గరకు లాక్కుని అందులో కూర్చుంటూ "చెప్పండి" అన్నాడు ఉత్సాహంగా.

ప్రొడ్యూసర్ & డైరక్టర్ తిక్క సుబ్బులు దివాకర్ కు కథ చెప్పటం మొదలు పెట్టాడు.

"మిగిలిన గాడిదలన్నీ నిజమైన గాడిదలు. మీరు గాడిద తోలు కప్పుకుని ఆ నిజమైన గాడిదలలో గాడిదగా వాటితో పాటూ ఉంటారు. మీకూ...ఒక నిజమైన గాడిదకూ మధ్య ఏర్పడే లవ్ కెమిస్ట్రియే కథకు ముఖ్యాంశం"

"ఒక నిజమైన గాడిదతో మీకు ఏర్పడే ప్రేమ, దాని వలన మిగిలిన గాడిదలలో ఏర్పడే ఈర్ష్య... మీరు గాడిద కాదు, మనిషి అని తెలిసిన తరువాత జాతి వదిలి జాతి వచ్చి చిచ్చు పెడుతున్నావని ఆ నిజమైన గాడిదలన్నీ కలిసి మిమ్మల్ని బాగా చితక బాదుతాయి...మీరు చచ్చి పోతారు...అదే క్లైమాక్స్”

“అప్పుడు అక్కడ అన్నమయ్య ప్రత్యక్షమౌతాడు. జాతులు రెండేనయ్యా, ఒకటి కొట్టే జాతి...ఇంకొకటి కొట్టించుకునే జాతి అని ముగిస్తాడు...ఎలా ఉంది కథ " అని అడిగాడు తిక్క సుబ్బులు.

దివాకర్ కు అతి పెద్ద షాక్ తగిలింది. తమాయించుకున్నాడు. కుర్చీలో నుండి లేచాడు. "మీకు ఒక పెద్ద నమస్కారం సార్...నాకు మీ సినిమానూ వద్దు...మీ గాడిద దెబ్బలూ వద్దు, ఇదిగోండి మీ డబ్బులు" అంటూ డబ్బును టేబుల్ మీద ఉంచి వెనక్కి తిరిగేడు.

"మిస్టర్ దివాకర్..." అంటూ ప్రొడ్యూసర్ & డైరెక్టర్ పిలుస్తున్నా వినిపించుకోకుండా గబగబా నడుచుకుంటూ హోటల్ నుండి బయటకు వచ్చాడు. ఎటు వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి. తల తిరుగుతున్న ఫీలింగ్...నిలబడే ఓపిక లేక పక్కనున్న అరుగు మీద కూర్చున్నాడు...పక్కకు ఒరిగాడు.

********************************

"వద్దు...వద్దు" అంటూ కళ్లు తెరిచాడు దివాకర్. చుట్టూ చూశాడు. తాను హాస్పిటల్లో ఉన్నానని గ్రహించాడు.దూరంగా తన భార్య మాలిని, స్నేహితుడు బుచ్చిబాబు తలుపు తెరుచుకుని రావడం చూశాడు.

"సాఫీగా సాగి పోతున్న నీ జీవిత ప్రయాణాన్ని అనవసరమైన ఆశలతో మలుపు తిప్పుతూ ప్రమాదాలను కొని తెచ్చుకోకు" స్నేహితుని మాటలు గుర్తుకు వచ్చాయి.

కళ్ళు మూసుకుని పడుకున్నాడు. దివాకర్ కళ్ళు తడిసున్నాయి. "నిజ జీవితంలో హీరో అవడానికి తాపత్రయ పడొచ్చుగానీ... సినిమాలలో హీరో అవాలని తాపత్రయ పడడం అందరికీ సాధ్యమయ్యేది కాదు....అందునా, పెళ్ళాం బిడ్డలున్న తనలాంటి వాడికి, ఒక బాధ్యతాయుతమైన మాస్టారికి అస్సలు తగదు" దృఢంగా మనసులో నిశ్చయించు కున్న దివాకర్ మళ్ళీ కళ్ళు తెరిచాడు. ఎదురుగా నవ్వుతూ కనిపించింది భార్య.




పని నుండి అలసిపోయి వచ్చిన పరమేశం గబ గబా నాలుగు మెతుకులు గొంతులో వేసుకొని, మంచమెక్కాడు. ఎక్కాడో లేదో దర్జాగా గురకపెట్టసాగాడు. ఆ గురకలోనే గాఢ నిద్రలోకి జారుకున్నాడు.

భార్య పుట్టింటికి పోయిన రోజున పరమేశానికి పర్వదినం. మంచానికి దుర్దినం. భార్య వుంటే మోచేతి పోట్లతో క్రమ శిక్షణగా పడుకునేలా చేస్తుంది. భార్య లేనప్పుడు పిల్లల్ని తల్లి గురవమ్మ దగ్గరకు పంపించి, చిత్ర విచిత్రమైన నిద్రను సుఖంగా

అనుభవిస్తుంటాడు. ఇప్పుడు కూడా అదే చేయ సాగాడు. కాళ్ళను వి ఆకారంలో చాపి, మంచం పట్టెలకు బలంగా ఆనించాడు. పెదాలను టప టపలాడిస్తూ ఆర్త ధ్వని లాంటి గురకను గది నిండా గుమ్మరిస్తున్నాడు. ఊరంతా మేలుకొనే వుంది. తను మాత్రం కలల లోకంలో విహరిస్తున్నాడు.

ఏ రోజు ఎలా వుంటుందో పైనున్న రాజుకే తెలుసు. మనిషికి తెలిసింది నలుసు. అ మాట కొస్తే పరమేశానికి తెలిసిందల్లా వంకాయ పులుసు.

"వామ్మో! ఓరి దేవుడో! యెంత పని జరిగిందిరో!" అని గురవమ్మ పెడ్తున్న శోకాలకు సప్త గుర్రాలతో స్వారీ చేస్తున్న గురక లోంచి గుడ్లెళ్ళ బెట్టాడు పరమేశం. రాక రాక వచ్చిన అవకాశానికి అంతరాయం కలుగ జేసిన తల్లిపై పట్ట రాని కోపంతో విరుచుకు పడదామని, దిగ్గున లేచి కూర్చున్నాడు.

పండ్లు పట పట కొరుకుతూ పక్క గది లోకి వెళ్ళాడు. టి.వి. ముందు జరుగుతున్న తతంగాన్ని చూడగానే అటెన్షన్ అయ్యాడు. భోరున ఏడుస్తున్న తన తల్లిని "వూర్కో నానమ్మ! వూర్కోమంటూ" పిల్లలు ఓదారుస్తున్నారు.

'ఏమైంది దీనికి? స్వంత బంధువులు చని పోయినా ఈ ఎత్తున ఏడ్చిన దాఖలాలు లేవు. కూడు తక్కువైందా? గుడ్డ తక్కువైందా? ఎందుకింతగా ఎగిసెగిసి పడుతోంది.' అనుకున్నాడు.

"ఏహే ఆపు నీ గోల బంగారం లాంటి నిద్ర పాడు చేసావు. ఇప్పుడేమైందని శోక రాగాలు" కస్సుమన్నాడు.

"ఒరేయ్! కొడుకా కూసో! మనల్ని ఏలేటోడు మోడి దొర గా టి.వి.లో ఏం జెప్తుండో సూడు! అయిదు వందలు, ఎయ్యి రూపాయలు చెత్త కాయితాలటయ్యో!" బొడ్లో దాచుకున్న సంచిని దులిపింది. కింద పడ్డ ఐదు, వెయ్యి నోట్లను తిప్పి తిప్పి చూసుకుంటూ గుండెలు బాదుకుంటూ... ఘొల్లుమంటుంటే... కీసుమనసాగిందామె గొంతు.

చేనులో బోరు వేయించాలని సంవత్సర కాలంగా దాస్తున్న లక్ష రూపాయలు గుర్తుకు రాగానే నిద్ర మత్తు నింగి వైపు దూసుకెళ్ళింది. వెన్నులో వణుకు మొలకెత్తుకొచ్చింది. ట్రాఫిక్ లో నిలిచి పోయిన వాహనాల్లా స్థంబించిన తన కళ్ళను టి.వి.కి గురి పెట్టి బిగుసుకు పోయాడు.

గురవమ్మ పెడ బొబ్బలు చుట్టు పక్కలకు పాకటంతో పరమేశం ఇంటి నిండా జనం వెల్లువెత్తారు. "ఏమైందేమైందంటూ?" కంగారు కంగారుగా అడిగారు. చీర కొంగుతో చెంపలు తుడ్చుకుంటూ... ముక్కు చీదుకుంటూ... "తినీ, తినకా కడుపు కట్టుకొని నాలుగు

రాళ్ళు యెనకేత్తుంటే... యివి చెల్లవంటున్నారేందిరో దేవుడా! " బాధతో మూలగ సాగింది.

అసలి విషయం తెలవ గానే నోరెళ్ళ బెట్టారందరూ. "నీవే గాదు.. మావి కూడా... డబ్బులే... బ్యాంకులో మార్చుకో వచ్చని చెప్తున్నారుగా... ఏడ్సుడెందుకు?... ఊర్కో!" ధైర్యం చెప్పారు. అందరూ కల్సి... పది నిమిషాలకో సారి బ్రేకింగ్ న్యూసంటూ వస్తున్న వార్తలను అర్ధరాత్రి వరకు కళ్ళల్లో ఒత్తులేసుకొని మరీ చూశారు. బ్యాంకులకు, పోస్టాఫీసులకు వెళ్ళి మార్చుకోవటానికి ఎన్ని తిప్పలు పడాలో తలచుకుంటూ... "ఇదేం ఖర్మరా! బాబు!" అనుకుంటూ ఎవరింటికి వారు వెళ్ళి పోయారు.

* * *

ఉదయాన్నే స్నానం చేసి కొత్త బట్టలేసుకున్నాడు. సైకిల్ శుభ్రంగా తుడుచుకున్నాడు. రోజుకు నాలుగు వేలే మార్చుకోవచ్చు నన్న నిబంధన వల్ల తొలుత తల్లి దగ్గరున్న నాలుగు ఐదు వందలు, రెండు వెయ్యి నోట్లను తీసుకున్నాడు. ఆధార్ కార్డ్ జేబులో వేసుకున్నాడు. గురవమ్మ ఆశీస్సులు తీసుకుంటుంటే... "నాన్నా నేనూ వస్తాను" వెంట పడ్డ ఏడేండ్ల కొడుకుని ముందు కూర్చోబెట్టుకొని... దగ్గర్లోనే వున్న టౌనుకి బయల్దేరాడు.

తొమ్మిది కూడా కాలేదు. బ్యాంకుల నిండా బారులు తీరాయి లైన్లు. సైకిల్ ను చెట్టు పక్కన స్టాండేసి... చెమట తుడ్చుకుంటూ లైన్ లో నిలబడ్డాడు పరమేశం.

నిల్చున్న వారంతా మోడీ నిర్ణయం పై రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు. కొందరు సమర్ధిస్తున్నారు. మరి కొందరు దుయ్య బడుతున్నారు. పరమేశం పల్లెత్తు మాటనకుండా వినడంపై మాత్రమే దృష్టి నిలిపాడు.గంటన్నర గడిచాక బ్యాంకు తలుపులు తెరుచుకొన్నాయి. దీంతో అప్పటి వరకు వంకర టింకరగా మారిన లైన్ స్కేలుతో గీత గీసినట్లుగా మారింది. ఈలోపు పరమేశం చేతిని గుంజటం ప్రారంభించాడు కొడుకు.

"ఏయ్! ఏందిరా! సప్పిడి చేయకుండా నిలబడు" గద్దించాడు. "నాన్నా! బాగా వస్తుంది" చివరేలు లేపి చూపించాడు.

"ఇప్పుడా..?" కోపంగా చూసి... లైన్ నుంచి పక్కకు జరిగి ముందూ, వెనక్కి చూశాడు. లైనుకి సరిగ్గా మధ్యలో ఉన్నాడు. 'అమ్మో! ఈ టైంలో బయటకు పోతే వెనుక బడతాను.' అనుకున్నాడు. "అటు పోయి రాపో!" కను బొమ్మలు ఆడిస్తూ సైగలు చేశాడు. వాడివేమీ పట్టించుకోకుండా "నువ్వు రా... నాన్నా..." అదే పనిగా గుంజుతున్నాడు. తప్పేట్టు లేదనుకొని ముందున్న వ్యక్తిని

పిలిచాడు. "సార్! పిల్లాడ్ని బయటకు తీసెకెళ్ళి వస్తాను. మీ వెనుక నేనే" నాలుగైదు సార్లు గట్టిగా చెప్పి మరీ వెళ్ళాడు. ఖాళీ స్థలం కోసం వెతుకుతూ అర కిలోమీటర్ నడిచాడు. పని పూర్తయ్యే సరికి పావు గంట దాటింది. ఆగ మేఘాల మీద పరిగెత్తుకుచ్చాడు. లైన్ బాగా కదిలింది. ఇంతకు ముందు నిల బడ్డది ఎవరి వెనుకో కనుక్కో లేక పోయాడు. కాసేపు ముందుకూ, వెనక్కి నడిచాడు. లాభం లేదనుకున్నాడు. మెల్లగా లైన్ మధ్యలో దూర బోయాడు. "ఏయ్! ఆగు! మేం మనషులం కాదా?" అంటూ నోరు తెరిచాడు ఒకడు.

అప్పుడు చూసాడు వాడి అవతారాన్ని. గుబురు మీసాలతో, మిడి గుడ్లేసుకొని తీక్షణంగా చూస్తున్నాడు. పరమేశానికి గుబురు మీసాలు చూస్తే గుండె దడ ఆటోమేటిక్ గా హైరేంజ్ లోకి వెళ్ళి పోతుంది. వెంటనే గజ గజ వణుకుతూ... గుబురు మీసాలోడ్ని నోట్లోనే తిట్టుకుంటూ లైన్ చివర కెళ్ళి      నిల్చున్నాడు.

అలా ఎండకు ఎండి... చెమటకు తడిసి... ఆకలితో అలమటించి... కాళ్ళ నొప్పులను తట్టుకొని... కొడుకు కలుగజేస్తున్న అవాంతరాలను దాటి లైన్లో నిల్చుంటే... కౌంటర్ దగ్గరకు చేరే సరికి సాయంత్రం నాలుగైంది.

చచ్చిచెడి నాలుగు వేలు మార్చుకోడానికే ఒక్క రోజంతా పోతే, ఇక తాను బోరుకోసం దాచుకున్న మొత్తం కొత్త నోట్ల లోకి మారాలంటే ఎన్ని రోజులు పనులు మానుకుని బ్యాంకు లైన్ లో నిల్చోవాలో తల్చుకోగానే అతడి గుండె వేగం ఒక్కసారిగా గంటకరవైమైళ్ళ వేగంతో కొట్టుకుంది.....సరేలే ఏదతే అదయ్యింది...ఓ పదిరోజులు నావి కావనుకుని బ్యాంకులకంకితం చేస్తే సరి అని గొణుక్కున్నాడు... అది విని పక్కనున్న ఆసామి ఎవరో, " ఏంటి ? మళ్ళీ రేపొద్దామనుకుంటున్నావా? వారానికొక్కసారే," బాంబు పేల్చాడు....ఆ లెక్కన లక్ష రూపాయలు కొత్త నోట్ లలోకి మారాలంటే ఎట్లరా నాయనా అనుకుంటుంటే, మళ్ళీ ఆ ఆసామే ఉపదేశించాడు...దీనికింత బాధెందుకు? తీసుకోడానికి లిమిటుంది కాని, బ్యాంకులో ఎయ్యడానికేం లేదు...ఎన్నైన ఏసుకోచ్చు....అన్నీ తెచ్చి ముందు ఏసేయ్..."

"ఏంటేసేదీ? నాకసలు బ్యాంకకౌంటే లేదు" నీరసంగా చెప్పాడు పరమేశం...

ఆ మాటతో పరమేశాన్ని ఎగాదిగా చూసాడా ఆసామి.. ఆ చూపులో " ఇగ సావుపో" అన్న భావం కనిపించింది పరమేశానికి.......సరే తర్వాత సంగతి తర్వాత, ముందైతే ఊళ్ళో అందరికన్నా ముందు చేతిలో పడ్డ రెండు వేల రూపాయల నోటుని అందరికీ గొప్పగా చూపించాలనుకొంటూ బయల్దేరాడు....

* * *

ఊర్లో కెళ్ళ గానే కనపడ్డ     ప్రతి ఒక్కరికి కొత్త నోట్లు చూపిస్తూ మురిసి పోసాగాడు.అదే ఉత్సాహంతో ఇంటికి వెళ్ళాడు. కొడుకును దగ్గరకు పిలిచి "ఒరేయ్ ఈ డబ్బులు నానమ్మకు ఇయ్యిపో!" అన్నాడు.

"నానమ్మ ఇదిగో కొత్త డబ్బులు" అంటూ గురవమ్మ చేతిలో పెట్టాడు మనుమడు. నోట్లను చూడగానే మండి పడింది. వెనక్కి, ముందుకూ మార్చి మార్చి చూసుకుంది. "ఒరేయ్! నేను పిచ్చిదాన్లా కనపడ్తున్నార్రా? మీ అయ్య సిన్నప్పుడు గోవిందు కొట్లో పావలా, అర్ధ పెట్టి లాటరీ తీస్తే వచ్చే కాగితాలివి..." అంటుంటే ఉలిక్కి పడ్డాడు పరమేశం.

"అవి కాదే! బ్యాంకు వాళ్ళు ఇచ్చిన కొత్త నోట్లు."

"రంగు కాయితాలు అచ్చెయ్యటానికి బాంకోళ్లు తిక్కలోళ్లా? అప్పటి రంగు కాగితాలని అంత తేలిగ్గా యెలా మర్చి పోతారా? యివి అవే!

నాకివన్ని గాదు... నువ్వు మార్చకొచ్చిన నా నాలుగు వేలు నాకివ్వంటూ..."     కొత్త నోట్లను పర్ర పర్ర చించేసింది.

"ఓసి నీ కడుపు గాల! ఎంత పని చేశావే...?" బిత్తరపోయి తెల్లమొహం వేశాడు. రెండు వేల కొత్త నోట్లు మిగిల్చిన విషాదంతో రెండుగా చీలి పోయింది పరమేశం గుండె. ఏం చేయాలో అంతు బట్టక ఉన్న చోటనే కుప్ప కుప్ప కూలాడు.




ఉదయాన్నే వాకింగ్ చేయడం ఉదయ్ అలవాటు. తన స్వగ్రామంలో హాయిగా పొలం గట్ల వెంట చల్లని పైర గాలి పీల్చుకుంటూ తనకు ఇష్టమైన పాటలు’ హం’ చేసుకుంటూ కనీసం రెండు గంట లైనా నడిచే వాడు. ఆ కొబ్బరి తోటల్లో నడుస్తుంటే ఎంత హాయిగా ఉండేదో! కొబ్బరి మట్టలు గాలికి కదులు తుంటే వచ్చే శబ్దం ఎంత బావుంటుందో! తన చదువంతా తన గ్రామంలోనే ఉంటూ- టూ వీలర్ ‘లో కాలేజ్ కి వెళుతూ గడిచి పోయింది. తర్వాత పీ.జీ కోసం వెళ్ళిన రెండేళ్ళూ ఏదో పర దేశపు ఓపెన్ జైల్ లో ఉన్నట్లు ముళ్ల మీద గడిపి, ఈ ఉద్యోగంలో ‘ ఉద్యోగం పురుష లక్షణమని ‘తండ్రి సలహా మేరకు చేరాల్సి వచ్చింది. అప్పటి నుంచి నడక కోసం ఈ కష్టాలు మొదలయ్యాయి. 'ఎలాగైనా ఈ చుట్టు పక్కల ఎంత దూరమైనా కానీ కొబ్బరి తోటలు ఎక్కడున్నాయో తెల్సు కుని వాటిలో వాకింగ్ చేయాలి, అప్పుడు కానీ తన మూడ్ బావుండదని పట్టు వదలని విక్రమార్కునిలా’ ప్రయత్నించి , చివరకు తన బ్యాంక్ కి వచ్చే కస్టమర్స్ నందరినీ అడిగి అడిగి ఇదో ఈరోజు ఈ కొబ్బరి తోటలకు 'అశోక వనం లో సీతమ్మను చూసిన హను మలా ' ఉబ్బిపోతూ బయల్దేరాడు.

ఉదయ్ ‘వాతావరణ కలుష్య నివారణ ’ పట్ల తీవ్రమైన ఆరాధనా భావం కలవాడు, దానికి తోడుగా మన ప్రధాని మోదీ గారి ప్రవచ నాలు బాగా మనసు కెక్కించుకుని’ స్వచ్ఛభారత్ ‘అని స్మరిస్తూ, పలవరిస్తూ బ్యాంకునంతా చాలా శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు కూడానూ. అందుకే వంటరి గా ఎక్కడికి వెళ్ళినా సైకిల్ మీదే వెళతాడు. అలా వంటరిగా సైకిల్ మీద ఏదో తన కిష్టమైన పాట ' హం ' చేసుకుంటూ ఊరికి దూరంగా ఉన్న కొత్తగా పెరుగుతున్న కొబ్బరి తోటలోకి వెళ్ళాడు. తన సైకిల్ ఒక

చెట్టుకు చైన్ వేసి తాళ మేసి , బ్యాంక్ తాళాలు జాగ్రత్తగా వేయడంలో మహా నేర్పరి గనుక , తాళం చెవి ఒక సేఫ్టీ పిన్ తో మొల త్రాటికి వేసు కుని , హాయిగా ఆ చెట్లమధ్య' భారత్ ను జయించిన అలెగ్జాండర్ 'లా సంతోషంగా ఎగురుతున్నట్లే నడువ సాగాడు. గంట సేపు నడిచాక ఆ ఆనందం గుండెలు నిండగా కొంత సేపు ఒక చెట్టు మొదట్లోకూర్చుని వెంటతెచ్చుకున్న సీసాడు నీరూ త్రాగేసి ' ఇంత కాలానికి తన నిరీక్షణ ఫలించి కొబ్బరి తోట దొరకడం, మూడు మార్లు అమేరికా వీసా కెళ్ళి చివరకు ఎలాగో ఒబామా కృప వల్ల దొరికి నట్లు మహదానందంతో హృది నిండగా సైకి లెక్కి తోటంగా నాల్గు రౌండ్లేసి , ఇంటి రోడ్డెక్కాడు. ఎంత కాలానికి తిరిగి కొబ్బరి మట్టల చప్పుడుకు గుండె అరలు లయ బద్ధంగా కదుల్తుండగా హాయిగా ఊపిరి పీల్చుకుంటూ , ఇలా వంటరిగా కాక తన స్టాఫ్ నంతటినీ, ఇంకా వీలుంటే తన అపార్ట్ మెంట్ సహా కుటుంబాల వారి నందరినీ ఆ తోటకు వాకింగ్ కు తెచ్చి, ఈ పచ్చ పచ్చని కొబ్బరి తోట లో వాకింగ్ చేయించి స్వచ్ఛమైన ప్రాణ వాయువును వారి చేత పీల్పించి, వారి జీవన ప్రమాణాన్ని, వీలైనంత పెంచాలని దృఢ నిశ్చయుడయ్యాడు. ఉదయ్ ఏదన్నా అనుకుంటే సాధించే వరకూ నిద్ర పోడు, తోటి వారిని నిద్ర పోనివ్వడూ, అందుకే సైకిల్ తొక్కుతూనే పథకాన్ని ఎలా నడపాలో బాగా ఆలోచించి ప్లాన్ చేశాడు, అందుకే ఇంటికెళ్ళ గానే భార్యామణి ఇచ్చిన కాఫీ సిప్ చేస్తూ, తను చించేసిన ఆలోచనలను ఆమె ముందుంచగా ఆమె, " మీ ఆలోచనలు ఎప్పుడూ అద్భుత మండీ ! మీ శ్రేయస్సే కాక మీ తోటి మానవుల శ్రేయస్సూ మీ కెప్పుడూ ఎరుకలో ఉంటుంది, ఇంకేం ఆచరణలో పెట్టేయండి. " అంటూ ప్రోత్సహించింది. వెంటనే ఆ రోజు ఆదివారమూ, 'కలిసొచ్చే కాలమొస్తే నడిచొచ్చే కొడుకు పుడతా ' డన్నట్లుగా, ఆరోజు అపార్ట్ మెంట్ మీటింగూ ఉండటాన గబగబా తయారై బయల్దేరాడు

మన హీరో. ముఖ్యంగా రానున్నరోజుల్లో 'స్వచ్ఛ భారత్ 'క్రింద అపార్ట్ మెంట్ కుటుంబాలన్నీ మూడు డస్ట్ బిన్స్ కొనుక్కుని, చెత్త మూడు బండ్లలో తీసుకెళ్ళే వారికి గుర్తుగా ఉండేలా మూడు రంగులు అదరివీ ఒకేలా ఉండాలి కనుక అపార్ట్ మెంట్ మేమేజి మెంట్ కొని ఇస్తుంది, ఊరికే కాదు, దానికైన డబ్బు ముక్కు పిండ కుండా నే, మెయింటె నెన్స్ లో కట్టించుకుని మరీనీ,' అవన్నీ తీసుకెళ్ళే వారికి కొంత ఎక్కువ పైకం కట్టాల్సి ఉంటుంది. అని ఈ రిజల్యూషన్ కు అంగీకారమేం అవసరం లేదు కనుక వర్కింగ్ కమిటీ పాస్ చేసింది. అంతా ముఖాలు ముడుచుకున్నారు , ఎక్కువ మైన్ టెనెన్స్ కట్టాల్సి రావడం వల్ల. ఇదేమంచి సమయం అని భావించి, మన హీరో మహోత్సాహంగా, " కోరుకున్న వారికి కోరుకున్నంత ప్రాణ వాయువు ఉచితం" అంటూ అనౌన్స్ చేసేసి , అందర్నీ ఆకర్షించను ప్రయాస పడి ఆతర్వాత నిదానంగా తన ప్రపో జల్ వినిపిం చాడు ' ఓస్ ఇంతేనా ' అని అంతా అనుకుంటుండగా ,"అక్కడ కావల్సినంత చోటుంది ముందుగా మనం అక్కడ ఒక పిక్నిక్ పార్టీ ఏర్పాటు చేసుకుందాం. ఆ కొబ్బరి తోట మీకంతా నచ్చితే ఆ తర్వాతే అందరం ఎవరి వెహికిల్స్ లో వారంతా కల్సి వాకింగ్ కెళ్ళి స్వచ్ఛ భారత్ లో స్వచ్ఛ ప్రాణ వాయువు పీల్చుకో వచ్చును. ఏమంటారు, వచ్చేది లాంగ్ వీకెండ్ కనుక అంతా పాట్ లక్ లా ఏర్పాటు చేసు కుని వెళ్దాం . దీనికై ఒక మహిళా కమిటీ ఏర్పడి, ఆధరువులను నిర్ణయించి ఆ ఏర్పాట్లకు ముందుకు వస్తే , మిగతా ఏర్పాట్లు మేం చూస్తాం." అన్నాడు. అంతా రోజు వారీ రొటీన్ లో విసిగి పోయి ఉన్నందున, ఉదయ్ ప్రొపోజల్ కు మూజువాణీ ఓటేశారు. అంతే పిక్నిక్ రెడీ. అంతా పిక్ నిక్ ఎంతో ఆనందంగా గడిపారు. ఆ కొబ్బరి తోట అందరికీ ఎంతగానో నచ్చే సింది.

దాంతో ఇహ ప్రాతః కాల నడక మొదలైంది, ముందు పురుషులు మాత్రమే ఆర్భాటంగా , లేడికి లేచిందే పరుగన్నట్లు తలో సైకిల్ కొని కొద్ది రోజులు వెళ్ళారు. ఆ తర్వాత సైకిల్స్ పడేసి కార్లలో బయల్దేరారు. ఒక్కో కార్లో ఐదు మంది చొప్పున కార్ పూలింగ్

చేసుకుంటూ, రెండు కార్లు, నలుగై, నల్గు ఎనిమిదై ,ఇంతింతై వటుడింతై అన్నట్లుగా రెట్టింపు రెట్టింపుగా పెరిగి పోయాయి కార్లు. వాకిం గ్ శాల్తీలూ పెరిగాయి. వారినంతా చూసి ఉదయ్ మనసు వందెకరాలంత విశాలమైంది. అంతా తనను పొగుడు తుంటే. షుమారుగా యాభై మందయ్యారు. అది వాపో, బలుపో తెలీడం లేదని అపార్ట్ మెంట్ అంతా అనుకో సాగారు. ఆదివారాలప్పుడు, అప్పుడప్పుడూ మహిళలూ' మేమేం తక్కువ !'అన్నట్లుగా స్పెషల్ వాకింగ్ డ్రెస్ కొని తొడిగి వాకింగ్ లో కలుస్తున్నారు. కార్లన్నీ కొబ్బరి తోట పక్కనే ఉన్న మట్టి రోడ్డు మీద పార్క్ చేసేసి హాయిగా నడకలు సాగిస్తున్నారు. ఆ కొబ్బరి చెట్లకు కొంచెం పక్కనే ఒక లేబర్ కాలని ఉంది. రేకుల ఇళ్ళూ, పూరిళ్ళూ, చుట్టు గుడిసెలూ లాంటివి. ఆ ఇళ్ళలోని వారంతా ముఖ్యంగా మహిళలు ఇలా వాకింగ్ కు తెల్లార గట్లనే వచ్చే వారిని తలుపు కొంచెం తీసి చూసి తిరిగి లోపలి కెళ్ళడం గమనించ సాగడు ఉదయ్.' వీరెప్పుడూ ఇంత మంది నడవడం చూసినట్లు లేదు వింతగా చూస్తూ, మళ్ళా ఏమనుకుంటామోని కాబోలు లోని కెళుతున్నట్లుంది, పాపం 'అను కున్నాడు. ఆపాపం ఎవరికో అతడికా సమయంలో తెలిసే అవకాశమే లేదు. అంతా బాగానే సాగితే ఇహ అనుకునే దేముంది! ఉన్నట్లుండి ఉపద్రవం చెప్పాపెట్టకుండా ముంచుకొచ్చి పడింది, నడక రాయుళ్ళ ముందు.

ఒక రోజున కార్లలో వెళ్ళే సరికి మట్టి రోడ్డుకు అడ్డంగా రాళ్ళు పెట్టే సున్నాయి, ఒక కిలో మీటరు దూరం లోనే. ఇదంతా అల్లరి పిల్లల పనై ఉంటుందని ,అంతా దిగి రాళ్ళన్నీ తీసి పక్కన పడేసి ముందుకు సాగారు. ఆ మరు నాడు అదే ప్రాంతంలో కర్రలను అడ్డం గా కట్టేసి ఉండటం చూసారు. ఆ కొబ్బరి తోట యజమాని పనై ఉంటుందని భావించి, మొదలయ్యాక ఆగేది లేదని అంతా ఆకర్రలను విప్పేసి లోనికి సాగారు. ఆమరునాడు రోడ్డు మో చేతి లోతున అడ్డంగా త్రవ్వి ఉండటం చూశారు.అంతే ఉదయ్ కి ఎక్కడ లేని కోపం ముంచు కొచ్చింది. 'ఏదో స్వచ్ఛ ప్రాణ వాయువు పీల్చుకోను వస్తుంటే ఇదేం వింత ! 'అనుకుని ఇద్దర్ని వెంట తీసుకుని నడుచు కుంటూ ముందుకు సాగాడు, టార్చి లైట్ వేసుకుంటూ. ఒక పది నిముషాలు నడవ గానే కొబ్బరి తోట చివరి పంట కాలువ హద్దు వద్ద వరు సగా తలలు కనిపించాయి, టార్చ్ లైట్ ఆపేసి మెల్లిగా ముందుకు సాగాడు తానొక్కడే, తనతోటి వాళ్లను అక్కడే ఆగమని సూచించి. ఉదయ్ కు చిన్నప్పటినుండీ సాహస కృత్యాలంటే అమిత ఇష్టం. గలివర్స్ ట్రావెల్స్ పుస్తకం తెగ చదివే వాడు. ఇంకా సింద్ బాద్ సాహ స యాత్రల పుస్తకాలన్ని వెతికి వెతికి వంద సార్లు చదివి కొంత సాహసం వంట బట్టించుకున్నాడు ఎలాగో. ఆసాహసం తోనే 'అవి దయ్యాల తలలా! మరేంటో ' తెల్సుకోవాలని ఆత్రంగా, అడుగులో అడుగేసు కుంటూనూ. దగ్గరి కెళ్ళాక అవి ఆడ వాళ్ల తలలని వెను క భాగంలోని జుట్టు చూసి తెలి సింది. అంత మంది అక్కడ ఉదయాన్నే ఇంకా తెల్లారక ముందే ఎందుకు కూర్చొనున్నారో తెలి లేదు. మరి కాస్త ముందుకు నిశ్శబ్దంగా వెళ్ల గానే అతడి అడుగులు అక్కడి ఎండు ఆకులపై పడి శబ్దమై చివుక్కున ఒక మహిళ వెనక్కు తిరిగి చూసి, వెంటనే లేచి నిల్చుంది. అంతే ఆ ఇరవై మందీ ఒక్క సారిగా గబుక్కున లేచారు. వారందరి చేతుల్లో నీళ్ల చెంబులు, డబ్బాలూ, సీసాలూ.. ఉదయ్ గబుక్కున వెనక్కు తిరిగి పరుగు లంకించు కున్నాడు. కార్ల దగ్గరికి వచ్చి ఆగి కాస్త మంచి నీళ్ళివ్వ మని సైగ చేసి , సీసాడూ త్రాగేసి. రొప్పుతూ వెనక్కు వెళ్ళదామని సైగ చేసి తన సైకి లెక్కాడు. అపార్ట్ మెంట్ కు వచ్చి ఆగా డు.

స్వచ్ఛ భారత్ ఎంత బావుందో అర్థమై బాధేసింది. ఒక సాధారణ పౌరునిగా తాను చేయ గలిగేదేమైనా ఉందాని తెగ ఆలోచించాడు. ఆరోజు అర్జెంట్ మీటింగ్ కాల్పార్ చేసి "స్వచ్ఛభారత్ అంటూ మనం మన ఇళళ్లో చెత్త కూడా డబ్బు మిగుల్చు కోను తీసు కెళ్ళి ఆ కొబ్బరి తోట పక్కనే ఉన్న గుంటల్లో పోస్తున్నా అక్కడ నివసించే వారు మనల్ని పల్లెత్తు మాట అనలేదు. వారి గురించి మనం అస్సలు పట్టించుకోనే లేదు. వారు తెల్లారు గట్లనే తలుపులు తెరిచి మనల్ని చూసి, మళ్ళా

లోపలికి ఎందుకు వెళుతున్నారో ఊహించ లేక పోయాం, వారికి ఎంతో ఇబ్బంది కలిగించాం. రాళ్ళూ, కర్రలూ, తీసేసి వెళ్ళాం, చివరకు మనల్ని ఆపను గుంతలు త్రవ్వి నా మనం వారి ఇబ్బందేంటో తెల్సుకో లేక పోయాం. మనం వారికి కలిగించిన ఆసౌకర్యానికే పాపం ఎంత బాధ పడ్డారో ఊహించు కుంటుంటే బాధేస్తున్నది" అంటూ తన బాధ వెలిబుచ్చి, శ్రీమతి ద్వారా మహిళలకు విషయం వివరించాడు ఉదయ్. అంత తేలిక కాపోయినా తమ అపార్ట్ మెంట్ వారితో కలసి వెళ్ళి ఒక సేవా కార్యక్రమంలా, ఓపికతో ఆ కాలనీ వారికంతా బ్యాంక్ లోన్స్ ఇప్పించి దగ్గ రుండి శౌచాలయాలు కట్టించి , తమ బ్యాంక్ సిబ్బందిని, కూడగట్టి ఆ విరాళంతో ఒక బోర్ వేయించి, నీటి సౌకర్యం కల్పించి, తిరిగి యధా ప్రకారం వాకింగ్ సాగించాడు కొబ్బరి తోటలోకి ఉదయ్! తననొక 'శ్రీమంతుడ 'ని అంతా పొగుడు తుంటే, తన వంతు ' స్వఛ్ఛభారత్ ' సేవ చేసినందుకు పొంగిపోతూ .




ఆనందు, రాజారావు, రవళి ల ఏకయిక పుత్రుడు ఆనందు కు ఎనిమిదో పుట్టిన రోజు ఈ మధ్యనే అయ్యింది

ఆ వేళ ఆదివారం

" ఆనందూ ఇంక లే అమ్మా రామం మావయ్య వచ్చే టయమయింది" అని వాళ్ళ అమ్మ పిలవగానే అనందు

టక్కున లేచి కూర్చున్నాడు. అది ఇంట్లో అందరికీ ఆశ్చర్యం కలిగించే విషయమే. ఎందుకంటే మామూలుగా రోజూ వాళ్ళ అమ్మ 'లే అనందూ' అని ఓ పదిహేను నిమిషాలు, నిమిషానికి ఒక మాటు చొప్పున అరిస్తే కానీ ఆనందు మంచం దిగడు.

ఇవాళ వాడి చిన్న మావయ్య 'రామం' ఎదో పని మీద వస్తున్నట్టు మొన్న ఫోనులో మాట్లాడినప్పుడు చెప్పాడు.

రామం ఎప్పుడు ఫోను చేసినా వాళ్ళ అక్కతో మాట్లాడిన తరువాత 'ఆనందు' తో కూడా మాట్లాడకుండా ఫోను పెట్టడు. ముందు గొంతు మార్చి మాట్లాడి " ఎవరు మాట్లాడుతున్నారో " చెప్పుకో అని కాసేపు వాడిని ఆట పట్టిస్తూ ఉంటాడు.

రామం వస్తున్నాడంటే ఆనందు చాలా ఉద్రేక పడటానికి కారణం రెండు విషయాలు. మొదటిది రామం తెచ్చే చాకలేట్. వాళ్ళమ్మ చూడకుండా ఆనందు కి అందిస్తాడు రామం. ఆనందుకు కొంచెం ఆయాసం ప్రోబ్లం ఉండడంతో వాళ్ళమ్మ చాకలేట్లు ఎక్కువ తిననియదు. రెండవది, ఎప్పుడు వచ్చినా ఎదో టయిములో షాపింగ్ కి తీసుకు వెళ్లి ఆనందు కు ఎదో ఒక ఆట వస్తువు కొని ఇస్తూ ఉంటాడు. ఈ మాటు ఆనందు మామూలుగా కంటే కొంచెం ఎక్కువ ఉద్రేక పడడానికి కారణం, వాళ్ళ ఇంటికి దగ్గరలోనే జరుగుతున్న ఒక ఎగ్జిబిషన్. రామం ఫోను చేసినప్పుడు ఆనందు దాని గురించి చాలా ఉద్రేకంగా చెప్పాడు. తాను అక్కడికి వెళ్లాలని, అమ్మా, నాన్న ఖాళీ లేక తనని తీసుకు వెళ్ళటల్లేదని. రామం రాగానే అక్కడికి తీసుకు వెళ్లాలని డిమాండ్ చేశాడు. ఆనందుని అక్కడికి తీసుకు వెడతానని రామం ప్రామిస్ చేశాడు ఫోనులో.

రోజూ , వాళ్ళమ్మ సహాయంతో లేచి బ్రష్ చేసుకుని స్నానం చేసి బట్టలు వేసుకోడానికి గంటన్నర పడితే, అవేళ అన్ని పనులూ అరగంటలో ముగించుకుని కూర్చున్నాడు ఆనందు.

బయట ఏ మాత్రం చప్పుడయినా ఎంట్రన్స్ లోని వరండా దగ్గరికి పరుగెడుతన్నాడు ఆనందు, రో హౌసెస్ లో వీళ్ళ ఇంటికి అనుకునే ఉన్న హౌస్ వరండా లో జానకయ్య గారు వీల్ చైర్ లో కూర్చుని ఆనందు ని చూస్తున్నాడు. కీళ్ళ వాతము వల్ల ఆయన ఎప్పుడూ ఆ చైర్ లోనే ఉంటాడు ఆనందు రెండు మాట్లు వరండా లోకి వచ్చి వెళ్లిన తరువాత, మూడో సారి అడిగాడు ఆయన " ఎరా ఎవరి కోసమయినా చూస్తున్నావా ? అనడిగారు నవ్వుతూ.

ఆనందు విషయం చెప్పిన తరువాత " ఓహో అలాగా! వెరీ గుడ్. మీ మావయ్య నీకు ఏమి కొన్నాడో రాగానే నాకు చూపించాలి ఒకే ?" అని కోడలు పిలిస్తే వీల్ చైర్ లోపలికి తిప్పాడు ఆయన

*******

మొత్తానికి రామం రావడం, ఆనందు కి చాకలెట్ అందించడం జరిగిన తరువాత, సాయంత్రం ఎగ్జిబిషన్ కి వెళ్ళడానికి ఒప్పందం కుదిరింది. ఆనందు తన స్నేహితులు ఎవరూ ఇప్పటి వరకూ కొననిది కొని వాళ్ళని ఆశ్చర్య పరచాలని, అలాటిది ఏమిటా అని ఆలోచిస్తూ సాయంత్రం దాకా కూడా తేల్చుకో లేక పోయాడు.

ఆ సాయంత్రం ఆనందు వాళ్ళ మావయ్య రామం తో ఎగ్జిబిషన్ కి వెళ్ళాడు. అక్కడ ఎన్ని షాపులు తిరిగినా అతనికి బాగా నచ్చిన దేదీ కనపడ లేదు. చివరికి ఒక చోట కొన్ని పంజరాలలో చిలకల్ని పెట్టుకుని ఒకతను కూర్చున్నాడు. ఒక్కొక్క పంజరంలో రెండేసి చిలకలు ఉన్నాయి. పంజరం లోనే అవి అటూ ఇటూ ఎగురుతూ ఎవరయినా వేసిన గింజలు తీసుకు తింటున్నాయి. ఆనందు కి అవి బాగా నచ్చాయి. అవి కిచ కిచ లాడుతూ ఎగురు తూంటే చాలా ఆనందంగా ఉంది వాడికి. వాడి బాబాయి ఇంకోటేదాయినా తీసుకుందామని చెబుతున్నా . మారాం చేసి అదే కొనిపించుకుని ఇంటికి తెచ్చాడు

ఇంట్లో ప్రవేశిస్తూ ఉంటె పక్క వరండా లో కూర్చున్న జనకయ్య గారికి పంజరం ఎత్తి చూపించాడు ఆనందు తాను ఎగ్జిబిషన్ లో ఏమి కొన్నాడో.

ఓహో చిలకలనా! అన్నాడు జానకయ్య గారు కొంచెం ఆశ్చర్యంతో కూడిన నిరుత్సాహంతో

ఆ రోజు అంతా , ఆనందూ, చుట్టూ పక్కల ఇళ్లల్లో ఉన్న ఆనందు స్నేహితులూ ఆ పంజరం లో ఆ చిలకలు వేసే గెంతులు చూస్తూ, వాటికి గింజలూ అవీ వేస్తూ

గడిపారు. ఆ మరునాడు కూడా అలాగే రాత్రి దాకా ఆడారు.

*******

ఆనందు ఇంటి దగ్గర పార్క్ లో మిగతా మిత్రులతో ఆడుతున్నాడు. తానూ ఇంకో ఫ్రెండ్ రాజా యే ఉన్నారు. చీకటి పడుతోంది. ఇంక ఇంటికి వెళ్లి పోవాలని అనుకుంటూ ఉండగా సడన్ గా వాళ్ళ ముందు పార్క్ లో చెట్ల మధ్య రంగు రంగు లైట్లు వెలుగుతూ ఒక చిన్న యంత్రం లాంటిది దిగింది. వాళ్లకి ఏమయిందో తెలిసే లోపలే ఇద్దరినీ ఎవరో ఆయంత్రం లోకి గెంటారు. అంతే యంత్రం గాలి లోకి ఎగిరింది. అలా హఠాత్తు గా జరగడంతో ఇద్దరికీ తెలివి తప్పి పోయింది.

వాళ్ళిద్దరికీ మెలకువ వచ్చే సరికి. వాళ్లిద్దరూ ఒక పెద్ద పంజరం లాంటి ఊసలు చుట్టూ ఉన్న పెట్టె లో ఉన్నారు. వాళ్ళ చుట్టూ వింత మనుషులు వీళ్ల ని వింతగా చూస్తున్నారు. వాళ్ళిద్దరికీ ఏడుపు రాలేదు. అమ్మా నాన్నా కూడా గుర్తుకు రాలేదు.

ఆనందు రాజా తో అన్నాడు. "వీళ్లంతా ఎవరు రా వింతగా ఉన్నారు?"

"ఏమోరా నాకూ తెలియటల్లేదు" తమని చూస్తున్న వాళ్ళ కేసి చూస్తూ అన్నాడు రాజా

వీళ్ళు మాట్లాడుకోవడం చూసిన ఆ వింత మనుషులు చప్పట్ల లాగ కొట్టి కేరింతలు లాగ కొట్టారు

వీళ్ళు తినడానికి అన్నట్టు ఊసల మధ్యనుంచి ఏవో విసిరారు. అవి చాకోలెట్ల లాగ ఉన్నాయి చూడ దానికి. ఇద్దరూ చెరొకటీ తీసుకు తిన్నారు. చాకోలెట్ కంటే చాలా బాగుంది. వింత వ్యక్తుల్ని చూస్తూ చాకోలెట్స్ లాంటివి తింటూ కొంత సేపు ఆనందం గానే ఉన్నారు. కానీ బయటికి వెళ్ళడానికి లేక పోవడం వాళ్లకి చాలా ఇబ్బందిగా ఉంది.

మరి కొంత సేపటికి వీళ్లున్న పెట్టె ని తీసుకుని ఇంకో చోటకి తీసుకు వెళ్లారు ఎవరో. అక్కడ కూడా ఇలాగే వింత వ్యక్తులు మూగి వీళ్ళని చూస్తూ కేరింతలు కొడుతున్నారు

అలా రెండు మూట్లు వాళ్ళని వాళ్ళ ఊళ్ళో జరిగే ఎగ్జిబిషన్ లాంటి చోట్లకు తిప్పడం జరిగిన తరువాత, వీళ్ళకి ఆ పెట్టెలోంచి బయట పడాలని అనిపించి ఊసలు లాగడానికి ప్రయత్నించారు. అలా చేసినప్పుడు ఎవరో వాళ్ళ చేతి మీద కొడితే చేతులు వెనక్కి తీసుకున్నారు.

వాళ్లకి చాకోలెట్స్ లాంటివి తినడం మొహం మొత్తి అన్నం తినాలనిపించింది. ఆనందుకు అందు లోంచి ఎలాగయినా బయట పడాలని ఊసలని గట్టిగా లాగాడు. ఎవడో అనందు చేతిమీద చాలా గట్టిగా కొట్టాడు

ఆ దెబ్బకి ఆనందుకు సడన్ గా మెలకువ వచినట్టు అయి కళ్లు తెరిచి చూస్తే తను రోజూ పడుకునే మంచం మీద ఉన్నాడు.

ఇదంతా కలేనా! అని అనుకున్నా ఇంకా భయం నుంచి తేరుకోక వాళ్ళ అమ్మ పక్కలో వెళ్లి పడుకున్నాడు.

తెల్లారి లేవగానే ముఖం అదీ కడుక్కుని     చిలకలున్న పంజరం దగ్గరికి పరిగెత్తాడు . వీడు పరిగెత్తడం చూసిన వాళ్ళ అమ్మ వాడి వెనకే వచ్చింది " మళ్ళీ ప్రొద్దున్నే వాటితో ఆడడం మొదలెట్టావా? " అంటూ

ఆనందు పంజరం తీసుకుని వీధి వరండాలోకి వచ్చాడు. వెంతనే పంజరం తలుపు తెరిచి 'రెండు చిలకల్ని' వదిలి పెట్టేశాడు. అవి కిల కిల లాడుతూ ఎగిరి పోయాయి

ఆనందు అలాచేయడం వెనక నుంచి వాళ్ళ అమ్మ, పక్క వరండాలో వీల్ చైర్ లో కూర్చుని కాఫీ తాగుతున్న జానకయ్య గారు ఆశ్చర్యం గా చూశారు. ఆనందు అలా ఎందుకు చేశాడో వాళ్ళ ఇద్దరికీ తెలియ లేదు.

జానకయ్య గారు మాత్రం చాలా ఆనందించాడు. అందుకు కారణం లేక పోలేదు. ఆయన చాలా ఆరోగ్యంగా ఉండి     ఉద్యోగం చేస్తున్నప్పుడు ఇలాగే 'ఒక చిలకల జంటని చాలా కాలం ఓ పంజరం లో ఇంట్లో ఉంచుకునేవాడు. ఇంటికి వచ్చిన ఒకరిద్దరు మిత్రులు " ఎందుకురా వాటిని అలా బంధిస్తావు? " అనేవారు

వాళ్ళ మాటలు ఆయన నవ్వుతూ కొట్టేసేవాడు. రిటైర్ అవగానే కీళ్ల వాతం తో వీల్ చైర్ లో కూల బడ గానే మొదట చేసిన పని చిలకలని వదిలేయడం